Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 132 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శనివారం, 29 - 11 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## 77 అడుగుల రాముడి విగ్రహాన్ని ఆవిష్కరించిన మోదీ



**గోవా :** దక్షిణ గోవా కనకోన పట్టణంలోని శ్రీ సంస్థాన్ గోకర్ణ పార్త గాలి జీవోత్తం మఠంలో ఏర్పాటు చేసిన 77 అడుగుల ఎత్తైన శ్రీరాముని కంచు విగ్రహాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం నాడు ఆవిష్కరించారు. మఠం 550వ వార్షికోత్సవం సందర్భంగా ఈ విగ్రహావిష్కరణ జరిగింది. సాధువులు, సంతులతో తనకున్న ఆధాత్మిత అనుబంధాన్ని ప్రధాని మోదీ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ప్రజలు తమ సంస్కృతితో మమేకమయ్యేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. మఠం 550వ వార్షికోత్సవంపై ఆర్గనైజేషన్ కమిటీ జాయింట్ కన్వీనర్ ఎస్ ముకుంద్ కామత్ మాట్లాడుతూ, 15,000 మంది ఈ ఈవెంట్‌లో పాల్గొంటున్నారని చెప్పారు. శంకర్ మహదేవన్, అనూప్ జలోటా తదితర ప్రముఖ కళాకారులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. శ్రీ సంస్థాన్ గోకర్ణ పార్తగాలి జీవోత్తం మఠం తొలి సారస్వత బ్రాహ్మిణ్ వైష్ణవ మఠమని పీఎంఓ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. దక్షిణ గోవాలోని పార్తగాలిలో మఠం ప్రధాన కార్యాలయం ఉంది. 13వ శతాబ్దంలో జగద్గురు మధ్వాచార్యులు స్థాపించిన ద్వైత సిద్ధాంతాన్ని ఈ మఠం అనుసరిస్తుందని పేర్కొంది.

## శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తులకు గుడ్ న్యూస్

**అమరావతి, (రాజధాని వార్తలు):** శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తులకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు శుభవార్త చెప్పారు. విమానాల్లో చెకింగ్ లేకుండా ఇరుముడి తీసుకెళ్లేందుకు అయ్యప్ప భక్తులకు వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. నేటి నుంచి అంటే శుక్రవారం (28-11-2025) నుంచి వచ్చే ఏడాది జనవరి 20వ తేదీ వరకు భక్తులకు ఈ వెసులుబాటు కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. ఎయిర్‌పోర్ట్ భద్రతా సిబ్బందికి పూర్తిగా సహకరించాలని ఈ సందర్భంగా అయ్యప్ప మాల వేసు కున్న భక్తులకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సూచించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా



వేదికగా ఆయన వెల్లడించారు. దీనికి తన వీడియోను సైతం జత చేశారు. తాజాగా పౌర విమానయాన శాఖ మంత్రి తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవు తుంది. తెలుగు రాష్ట్రాల నుంచి శబరిమలకు ఏటా లక్షలాది మంది భక్తులు వెళ్తుంటారు. వారు సైతం ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు.

## దూసుకొస్తున్న దిత్వా తుఫాను.. హోంమంత్రి కీలక ఆదేశాలు



**అమరావతి, (రాజధాని వార్తలు):** శ్రీలంకలో మొదలైన దిత్వా తుఫాను ఏపీని తాకే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తిరుపతి, చిత్తూరు, కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల అధికారులను హోంమంత్రి వంగలపూడి అనిత అప్రమత్తం చేశారు. మరో రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. శిథిలావస్థ స్థితిలో ఉన్న ఇళ్లలో నివసించే వారిని గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని హోంమంత్రి అన్నారు. ఎక్కడా పాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలన్నారు. కోస్తా తీరం వెంబడి ఈదురుగాలులు వీస్తాయని సూచనలు చేశారు. ఈ క్రమంలో ప్రమాదకరమైన హోర్డింగ్స్‌ను వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాల్లో, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. సోమవారం వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి సూచించారు. రైతాంగం వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హోంమంత్రి అనిత కీలక సూచనలు చేశారు. కాగా.. నైరుతీ బంగాళాఖాతాన్ని ఆనుకుని ఉన్న శ్రీలంక తీరంలో దిత్వా తుఫాను కేంద్రీకృతమై ఉంది. ప్రస్తుతానికి ఇది శ్రీలంకకు 80 కిలోమీటర్ల దూరంలో, పుద్దుచ్చేరికి 480 కిలోమీ టర్లు, చెన్నైకి 580 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. గడిచిన ఆరుగంటల్లో 8 కిలోమీటర్ల వేగంతో తుఫాను కదులుతోంది. ఎల్లుండి (ఈనెల 30) నైరుతీ బంగాళాఖాతం, ఉత్తర తమిళనాడు, పుద్దుచ్చేరి, దక్షిణ కోస్తా తీరాలకు చేరుకునే అవకాశం ఉందని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. దీని ప్రభావంతో కోస్తా, రాయలసీమలో రేపు, ఎల్లుండి భారీ వర్షాలు నమోదు అయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. మత్స్యకారులు సముద్రంలోకి వెల్లకూడదని, రైతులు వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. రేపు మధ్యాహ్నం నుంచి దిత్వా తుఫాను ప్రభావం కోస్తా జిల్లాల్లో, రాయల సీమలో ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

## దిత్వా తుపాను బీభత్సం.. శ్రీలంకలో 56 మంది మృతి, మోదీ సంతాపం

**న్యూఢిల్లీ:** శ్రీలంకలో దిత్వా తుపాను కారణంగా ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడి 56 మంది మరణించగా, 21 మందికి పైగా జాడ గల్లంతైంది. దీంతో శ్రీలంక ప్రభుత్వం శుక్రవారంనాడు పబ్లిక్ హాలిడే ప్రకటించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుఫాను వేగంగా భారత్ వైపు దూసుకు వస్తుండటంతో తమిళనాడు, పుదుచ్చేరి ఆంధ్రప్రదేశ్, కేరళలో అలర్ట్ ప్రకటించారు. ఈ రాష్ట్రాల్లోని కోస్తా తీర ప్రాంతాలను ఈనెల 30న తుపాను తాకే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.


**మోదీ సంతాపం**

దిత్వా తుపాను కారణంగా వరదలతో శ్రీలంకలో భారీ ప్రాణనష్టం జరగడంపై ప్రధానమంత్రి మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాలు త్వరితగతిన కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్టు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. ప్రస్తుత సంక్లిష్ట పరిస్థితుల్లో శ్రీలంకను ఆదుకునేందుకు 'ఆపరేషన్ సాగర్ బంధు' కింద సహాయ సామగ్రిని పంపిస్తున్నట్టు తెలిపారు. కాగా, తమిళనాడు, రాయలసీమ, ఆంధ్రప్రదేశ్, కేరళలో శుక్రవారంనాడు పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడవచ్చని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. మరోవైపు తమిళనాడులోని తూత్తుకుడిలో



పలు ప్రాంతాలు కొద్దిరోజులుగా భారీ వర్షాలతో జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీనిపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. దిత్వా తుపానును ఎదుర్కొనేందుకు పూర్తి సన్నద్ధతతో ఉన్నట్టు చెప్పారు. డెల్టా జిల్లాలు, దక్షిణాది ప్రాంతాల్లో ఈనెల 29-30 తేదీల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరికలు చేసిందని, దీనిపై 14 జిల్లాల కలెక్టర్లతో తాను సమావేశమై అప్రమ త్తంగా ఉండాలని ఆదేశించానని చెప్పారు. సైక్లోన్ ప్రభావం ఉండే ప్రాంతాల్లో సహాయక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 16 ఎస్‌డీఆర్ఎఫ్ టీమ్‌లు, 12 ఎన్‌డీఆర్ఎఫ్ టీమ్‌లను ఆయా జిల్లాల్లో మోహరిస్తున్నట్టు చెప్పారు.


## మళ్లీ ల్యాండ్ పూలింగ్‌కు రంగం సిద్ధం



**అమరావతి, (రాజధాని వార్తలు):** చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాజధాని అమరావతి ప్రాంతంలో రెండో విడత ల్యాండ్ పూలింగ్ చేపట్టాలని రాష్ట్ర కేబినెట్‌లో ఆమోదం తెలిపింది. ఈ దశలో మరో16 వేల ఎకరాల సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించిన ప్రక్రియపై ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. మొదటి దశలో ప్రభుత్వ భూమి 16 వేల ఎకరాలు సీఆర్డీఏకు ప్రభుత్వం అప్పగించింది. రాజధాని అమరావతి కోసం మొత్తం 50 వేల ఎకరాలు రైతుల నుంచి భూ సమీకరణ చేపట్టాలని ప్రభుత్వం భావించింది. మొదటి దశలో రైతుల నుంచి 34 వేల ఎకరాల సమీకరణ.. రెండో దశలో మరో 16 వేల ఎకరాలపై కసరత్తు చేస్తోంది. త్వరలో ల్యాండ్ పూలింగ్‌కు సంబంధించిన నోటిఫికేషన్‌ను సీఆర్డీఏ విడుదల చేయనుంది. మొత్తం ప్రభుత్వ భూమి, రైతుల వద్ద నుంచి తీసుకున్న భూమితో కలిపి 74 వేల ఎకరాలలో రాజధాని నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టనుంది. ఇక ఈ రెండో విడత భూ సమీకరణకు సంబంధించి 7 గ్రామాల్లో భూ సేకరణ చేయనుంది. వైకుంఠపురంలో 3,361 ఎకరాలు, పెదమద్దూరులో 1,145 ఎకరాలు, ఎంద్రాయిలో 2,166 ఎకరాలు, కర్లపూడిలో 2,944 ఎకరాలు, వడ్డమానులో 1,913 ఎకరాలు, హరిశ్చంద్రపురంలో 2,418 ఎకరాలు, పెదపరిమిలో 6,513 ఎకరాల భూ సమీకరణకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ప్రభుత్వ అసైన్డ్ భూములతో కలిపి మొత్తం 20, 494 ఎకరాల భూ సేకరణ ద్వారా సీఆర్డీఏ తీసుకోనుంది.

## విఐటి-ఏపి విశ్వవిద్యాలయ నూతన వైస్ ఛాన్సలర్ (ఇన్-ఛార్జ్)గా డా.పి.అరుల్మోళివర్మన్ బాధ్యతలు స్వీకరణ

**అమరావతి, (రాజధాని వార్తలు):** విఐటి-ఏపి విశ్వవిద్యాలయ నూతన వైస్ ఛాన్సలర్ (ఇన్-ఛార్జ్)గా డా.పి.అరుల్మోళివర్మన్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన నవంబర్ 21న పదవీ విరమణ చేసిన వైస్ ఛాన్సలర్ డా.ఎస్ వి కోటారెడ్డి నుండి పదవీ బాధ్యతలు స్వీకరించారు. దార్శనిక విద్యా నాయకుడు, విశిష్ట పరిశోధకుడు మరియు డైనమిక్ అడ్మినిస్ట్రేటర్ అయిన డా౹౹ అరుల్మోళివర్మన్, ప్రపంచ స్థాయిలో నాణ్యమైన విద్య మరియు పరివర్తన పరిశోధనలకు విఐటి-ఏపి విశ్వవిద్యాలయ యొక్క నిబద్ధతకు అనుగుణంగా పని చేస్తానని తెలియచేసారు. విశిష్ట విద్యా మరియు పరిపాలనా అనుభవంతో, డా౹౹ అరుల్మోళివర్మన్ విఐటి సంస్థలలో అనేక కీలక నాయకత్వ పదవులలో పని చేశారు. ఇటీవల, ఆయన విఐటి వెల్లూరులో (2021-2025) డీన్ - అకడమిక్ రీసెర్చ్‌గా బాధ్యతలు నిర్వహించారు మరియు గతంలో స్కూల్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ డీన్ (2015-2018) గా పనిచేశారు. అక్కడ ఆయన విద్యా ప్రమాణాలను పెంచడంలో మరియు ప్రపంచ స్థాయి పరిశోధన పర్యావరణ వ్యవస్థను పెంపొందించడంలో కీలక పాత్ర పోషించారు. డా.అరుల్మోళివర్మన్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, తిరుచ్చిలో తన పిహెచ్.డి. పూర్తి చేశారు మరియు 2005లో వెల్లూరులోని విఐటిలో చేరడానికి ముందు ఇతర ప్రసిద్ధ విశ్వవిద్యాలయాలలో పనిచేశారు. డా.అరుల్మోళివర్మన్ ఉత్పాతక వృద్ధి మరియు అనువాద పరిశోధనలో మార్గదర్శక కృషికి ప్రసిద్ధి చెందారు, DRDO, ISRO, BIRAC, DST మరియు MeitY వంటి జాతీయ సంస్థల నుండి ప్రతిష్టాత్మక గ్రాంట్లను పొందారు. అరవింద్ ఐ హాస్పిటల్, ఎయిమ్స్ న్యూఢిల్లీ మరియు జాన్స్ హాప్కిన్స్ యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్, అమెరికా వంటి అగ్ర వైద్య మరియు పరిశోధనా సంస్థలు సహకారాన్ని



అందించారు. రాబర్ట్ బాష్, హనీవెల్, శామ్‌సంగ్ ఆర్ & డి, జాన్సన్ కంట్రోల్స్, షైడర్ ఎలక్ట్రిక్, డాన్ఫాస్ మరియు జిఇ వంటి ప్రముఖ పరిశ్రమలతో బలమైన భాగస్వామ్యాలను ఏర్పరచుకున్నారు. విద్యార్థులు మరియు అధ్యాపకులు వాస్తవ ప్రపంచ సాంకేతిక సవాళ్లతో నిమగ్నమయ్యేలా స్పాన్సర్-ఆధారిత ఆవిష్కరణ ప్రయోగశాలలను సులభతరం చేశారు. తన నియామకం గురించి డా.పి.అరుల్మోళివర్మన్ మాట్లాడుతూ విఐటి-ఏపి విశ్వవిద్యాలయానికి నాయకత్వం వహించడం నాకు చాలా గౌరవంగా ఉందని, అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి, పరిశోధన, నూతన ఆవిష్కరణలు మరియు సామాజిక అభివృద్ధిని పెంపొందించే విధంగా కృషి చేస్తానని తెలియచేసారు. నాపై నమ్మకం ఉంచి, విఐటి-ఏపి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ (ఇన్-ఛార్జ్)గా నన్ను నియమించినందుకు గౌరవనీయులైన ఛాన్సలర్ డా.జి. విశ్వనాథన్ మరియు విఐటి గ్రూప్ వైస్ ప్రెసిడెంట్లు శంకర్ విశ్వనాథన్, డా.శేఖర్ విశ్వనాథన్, డా.జి.వి.సెల్వంలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియచేసారు.

## నిర్మలా సీతారామన్‌ను చూసి ఎంతో నేర్చుకోవాలి : మంత్రి లోకేష్

**అమరావతి, (రాజధాని వార్తలు):** అమరావతిని ఆపడానికి అది ఎవరి ఇంట్లోనో లైట్ స్విచ్ కాదని.. పవర్ ఫుల్ ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన రాజధాని అని మంత్రి లోకేష్ అన్నారు. శుక్రవారం నాడు రాజధానిలో బ్యాంకులు, భీమా కంపెనీల ప్రధాన కార్యాలయాల శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం, పాలకులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేవతల రాజధాని అమరావతిని దెయ్యాలు విధ్వంసం చేయాలని చూశాయని విమర్శించారు. మూడు రాజ ధానులని మూడు ముక్కలాట ఆడి ఈ ప్రాంతాన్ని నాశనం చేయాలని చూశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క వ్యక్తి కోసం రూ.450 కోట్లు ఖర్చు పెట్టి ప్యాలెస్ కట్టుకున్నారని అన్నారు. అయినా కూడా అక్కడి రైతులు ఒకే రాష్ట్రం ఒకే రాజధాని అనే నినాదంతో పోరాడారని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా జై అమరావతి నినాదంతో ముందుకు వెళ్లామని మంత్రి గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ పనులు పునఃప్రారంభించి జెట్ స్పీడ్‌లో నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సింప్లిసిటీకి హ్యాట్సాఫ్ అని అన్నారు. మంగళగిరి చేనేత వస్త్రాలు ధరించి ప్రమోట్ చేసినందుకు ఆమెకు ధన్యవాదాలు తెలియజేశారు. స్త్రీ శక్తికి ప్రతిరూపం నిర్మలా సీతారామన్ అని అన్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలన్నది నిర్మలాను చూసి ఎంతో నేర్చుకోవాలని తెలిపారు. ఏపీ ఏ సాయం కోరినా ఆర్థిక మంత్రి సహకారం అందిస్తున్నారన్నారు. పోలవరం, అమరావతి రాజధాని నిర్మాణానికి నిధులు ఇవ్వటంతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కూడా ఆదుకున్నారన్నారు. భారత్‌లో అతిపెద్ద డేటా సెంటర్ గూగుల్ విశాఖకు వస్తోందని..దీనికి నిర్మలా సీతారామన్ అండగా నిలిచారని తెలిపారు. 15 బ్యాంకులు, బీమా కంపెనీలు రూ.1334 కోట్లతో తమ ప్రధాన కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నాయని అన్నారు. అన్ని బ్యాంక్ సర్వీసులు ఒకేచోట ఉండేలా బ్యాంకు స్ట్రీట్ ఏర్పాటవుతోందన్నారు. రాజధానిలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని బ్యాంక్ స్ట్రీట్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా లావాదేవీలకు ఈ కార్యాలయాలు పనిచేస్తాయని వెల్లడిం చారు. అమరావతి రైతుల ప్రతీ సమస్యను పరిష్కరించేందుకు త్రిసభ్య కమిటీ కృషి చేస్తోందన్నారు. గత 5 ఏళ్ల విధ్వంసం దృష్టిలో పెట్టుకుని రైతులు ఐకమత్యంగా అమరావతి అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి లోకేష్ కోరారు.



# విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో ఎన్ఇపి - 2020 బహుళ ప్రవేశ-నిష్క్రమణ వ్యవస్థపై అవగాహన కార్యక్రమం






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (VSU), నెల్లూరు, తమ సామాజిక కార్య విభాగం ఆధ్వర్యంలో జాతీయ నూతన విద్యా విధానం (NEP-2020) లోని కీలకమైన Multiple Entry and Multiple Exit System (MEME) పై ఒక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సమావేశానికి అనుబంధ మరియు స్వయంపాలిత కళాశాలల ప్రిన్సిపాళ్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమం PM-USHA పథకం క్రింద జరిగింది. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై దీపప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థ వేగాన్ని, భవిష్యత్తు లక్ష్యాలను స్పష్టపరిచారు.

ఆర్థిక లక్ష్యం: ప్రస్తుతం భారత్ 4 ట్రిలియన్ డాలర్ల GDP వద్ద ఉంది. 2027-28 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకుంది.

అభివృద్ధి వేగం: మొదటి $1 ట్రిలియన్ GDPకి 60 సంవత్సరాలు పట్టగా, ఇప్పుడు ప్రతి $1 ట్రిలియన్ పెరుగుదలకు కేవలం 7 సంవత్సరాలు మాత్రమే పడుతోంది. $4 ట్రిలియన్ల నుండి $5 ట్రిలియన్లకు చేరడానికి కేవలం 2 సంవత్సరాలు పట్టవచ్చని అంచనా.

2047 లక్ష్యం: 2047లో స్వాతంత్ర్యం వచ్చి 100 సంవత్సరాలు పూర్తయ్యే నాటికి, భారతదేశ GDPని 20 ట్రిలియన్ డాలర్ల వరకు తీసుకెళ్లాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యం నెరవేరితే భారత్ ప్రపంచంలో రెండో లేదా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుంది.

యువత బాధ్యత: భవిష్యత్తులో దేశాన్ని 'అభివృద్ధి చెందుతున్న దేశం' నుండి 'పూర్తిగా అభివృద్ధి చెందిన దేశం'గా మార్చే బాధ్యత నేటి యువతపై (విద్యార్థులపై) ఉంది. భవిష్యత్తులో పాలనా నిర్ణేతలుగా, కీలక పదవుల్లోకి వచ్చేది ఈ యువతే కాబట్టి, విద్యా సంస్థలు జ్ఞానం-నైపుణ్యాలను అందించడంలో తమ పాత్రను బలోపేతం చేసుకోవాలి.

డిస్టింగ్విష్డ్ గెస్ట్ & రిసోర్స్ పర్సన్ అయిన డాక్టర్ టి. రవీందర్ రెడ్డి Multiple Entry and Multiple Exit System (MEME) మరియు Academic Bank of Credits (ABC) వ్యవస్థ గురించి వివరించారు.




MEME ప్రాముఖ్యత: ఇది విద్యార్థులకు అకడమిక్ స్వేచ్ఛను, నైపుణ్యాభివృద్ధిని అందిస్తుంది.

సౌలభ్యం: విద్యార్థులు తమ వ్యక్తిగత పరిస్థితులు, అవసరాలు, ఆసక్తులకు అనుగుణంగా తరగతుల్లో ప్రవేశించి, మధ్యలో నిష్క్రమించి, 7 సంవత్సరలలోపు తిరిగి చేరే (రీ-ఎంట్రీ) అవకాశం ఉంటుంది.

క్రెడిట్ భద్రత: వారు సంపాదించిన అకడమిక్ క్రెడిట్‌లను భద్రపరుచుకునే వీలు కల్పిస్తుంది.

సమగ్ర ప్రసంగం: MEME అమలు విధానం, అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ABC) వ్యవస్థ, క్రెడిట్ల మైగ్రేషన్ మరియు కళాశాలలు అనుసరించాల్సిన మార్గదర్శకాలపై ఆయన సమగ్ర వివరణ ఇచ్చారు.

# ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎయిడ్స్‌పై అవగాహన








**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశముల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ,జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ విభాగం సహకారంతో ఈరోజు నవజీవన్ ఆర్గనైజేషన్ -సి.సి- పి.యు- ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో "ఐ.ఇ.సి స్టాల్" ద్వారా హెచ్.ఐ.వి/ఎయిడ్స్ పై అవగాహనను నాయుడుపేటలోని "ప్రభుత్వ హాస్పిటల్" నందు నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమమును ప్రభుత్వ హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ అమర్నాథ్ చేతులు మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగముగా ప్రాజెక్ట్ మేనేజర్ అయిన కె. బాలాజి మాట్లాడుతూ, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాప్తి కారకాలు, ఎలా వ్యాపించదు, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ లక్షణాలు, అవి రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్, క్షయ వ్యాధి సంబందం గూర్చి, సుఖ వ్యాధులు మరియు చికిత్స గూర్చి, డ్రగ్స్ వాడకం వలన కలిగే ఇబ్బందులు, కండోమ్ యొక్క ఉపయోగము గూర్చి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ ఏక్ట్ 2017, ఎ.ఆర్.టి మందులు, ఏ.పి.శాక్స్ యాప్, టోల్ ఫ్రీ నెంబర్ 1097 గూర్చి తెలుపుతూ, మీ ద్వారా తెలియని వాళ్లకు తెలియజేయమని చెప్పడం జరిగింది.

తదుపరి మెడికల్ ఆఫీసర్ పి.యన్ అమర్నాథ్ మాట్లాడుతూ నవజీవన్ ఆర్గనైజేషన్ వారు చేస్తున్న సేవలు అభినం దనీయం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిపార్ట్మెంట్ కానిస్టేబుల్ కె.భాస్కర్ రాజు, నవజీవన్ సి.సి పి.యు ప్రాజెక్టు సిబ్బంది కె.బాలాజి, కవిత, శ్రావణి, సాయిలక్ష్మి, శ్రీలత, ఇతర హాస్పిటల్ సిబ్బంది మరియు ఇతర ప్రజలు పాల్గొన్నారు. తదుపరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు మరియు యస్.పి.జి.సి జూనియర్ కళాశాల నందు హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన కలిగించి వారికి క్విజ్ మరియు వ్రాతపరీక్షలు నిర్వహించి వారు ఎంత వరకు అవగాహన పొందారో తెలుసుకోవడం జరిగింది. వారికి ప్రధమ, ద్వితీయ, తృతీయ బహుమతులు త్వరలో అందిస్తామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్ లు, ఇతర అధ్యాపకులు, 83 విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# మధ్యాహ్నం భోజనం అమలులో నాణ్యత, పరిశుభ్రత పాటించండి




**అమలాపురం, (రాజధాని వార్తలు):** డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకాన్ని ప్రభుత్వం జోన్‌ల వారీగా నిర్ణయించిన మెనులో గుడ్డు, రాగి జావ, చక్కీ పోషక ఆహారం తాజాగా వండి వడ్డించాలని జిల్లా రెవెన్యూ అధికారి కొత్త మాధవి ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని లేకుంటే చర్యలు తప్పవని ఆర్డిఓ హెచ్చరించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజనం ఏర్పాట్లలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గుర్తించిన లోపాలపై ఎన్జీవోల ప్రతినిధులు సంబంధిత పథక అమలు అధికారులతో గురువారం సమీక్షించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజనం అమలులో కిచెన్ గార్డెన్స్ 858 పాఠశాలలో మాత్రమే అమలు చేస్తు న్నట్లు వెల్లడించారు. నీటి వనరులు, నిరంతర పర్యవేక్షణతో తాజా కూరగాయలను పండించి తాజాగా పిల్లలకు అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని ఆదిశగా చర్యల బలోపేతం చేయాలన్నారు. మిగిలిన చోట్ల పాఠశాలల్లో స్థలాలు అందుబాటులో లేక కిచెన్ గార్డెన్స్ నిర్వహించడం లేదన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యనుబట్టి పారిశుధ్య కార్మికులను నియమించుకోవాలన్నారు. భావితరాల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బాలికా సంరక్షణ కార్యక్రమం కింద బాలికలకు న్యాప్కిన్లు కేంద్రం అందిస్తోందని వీటిని పూర్తిస్థాయిలో సర ఫరా చేయడంలేదని ఎన్జీవోల నుండి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో పూర్తిస్థాయి సరఫరాకు కృషి చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో ఏఎన్ఎం పిల్లల ఆరోగ్య భద్రత పరిరక్షణ చర్యలు చేపట్టి పూర్తిగా అనారోగ్య సమస్యలను చక్కదిద్దాలన్నారు. పాఠశాలల్లో పారిశుద్ధ్యం, ఆరోగ్య భద్రత అంశాలలో ఎన్జీవో నుండి వస్తున్న ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించి ఆయా వసతులను సమగ్రంగా మెరుగు పరచాలన్నారు. కూరగాయలు, ఆకుకూరలు పద్దతి ప్రకారం సాగును సీజన్‌కి తగ్గట్టుగా నిర్వహిస్తూ పోషక విలువలు కలిగిన విత్తనాలు, ఆర్గానిక్ ఎరువుల వినియోగించి పండించాలని సూచించారు. బియ్యం, పప్పులు, నూనె, గుడ్లు వంటి సరుకుల నిల్వ గదులు గాలి సంచరించే విధంగా ఏర్పాటు చేసి పదార్థాలు చెడిపోకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఎలుకలు, పురుగులు వ్యాప్తి చెందకుండా భద్రతా చర్యలు తీసుకో వాలన్నారు. వంట గదుల్లో తాగునీరు, చేతులు కడు క్కోవడానికి వాష్ రూములు ఏర్పాటు చేయాలన్నారు. అదునాతన పద్ధతిలో వేడి నీరు, డిటర్జెంట్లలో శుభ్రపరిచి వేరుగా ఆరబెట్టడం వంటి విధానాల ఆచరించాలన్నారు. పిల్లల్లో అలర్జీ, ఫుడ్ పోయి జనింగ్ వంటి సంఘటనలకు ఉత్పన్నం కాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నిత్యం ఆహార పదార్థాలు అందించాలన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రీషన్ సూచించిన కేలరీ, ప్రోటీన్‌లు తగ్గకుండా ఆహార పదార్థాలు సమృద్ధిగా అందించాలన్నారు. స్థానికంగా లభించే తాజా కూరగాయలు, ఆకుకూరలు వాడా లని మార్గదర్శకాలు ఉన్నా, కొన్నిచోట్ల లోపాలు ఉన్నట్లుగా ఎన్జీవో ప్రతినిధుల నుండి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.

వీటిని సరిదిద్దుకోవలసిన అవసరం ఉంద న్నారు. వంట పదార్థాల నాణ్యత, బరువు, సరఫరా సరైన సమ యానికి వస్తుందా అనే సామాజిక ఆడిట్ పద్ధతులు సమర్థవం తంగా నిర్వహించాలన్నారు. పాఠశాల ఆడిటు తనిఖీ అంశాలలో మెలకువలు పాటించాలన్నారు. పాఠశాల నిర్వహణ కం పేరెంట్స్ కమిటీలు మధ్యాహ్న భోజనం అం శాన్ని నెలసరి సమావేశాల్లో ప్రాధాన్యంగా చర్చించి తగు పటిష్ట చర్యలు, తీర్మానాలు ద్వారా సమర్థ నిర్వహణకు పూర్తి పర్యవేక్షణ ఉండాలన్నారు. వంటవారికి ప్రత్యేక అధునాతన శిక్షణతో పాటుగా, ప్రధానోపాధ్యాయులతో ఆహార భద్రత ఓరియెంటేషన్ చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో షేక్ సలీం భాష, సమగ్ర శిక్ష ఏపీసి జి మమ్మీ, డి ఎం అండ్ హెచ్ ఓ దుర్గారావు దొర, అదనపు డీఎంహెచ్వో సిహెచ్ భరత లక్ష్మి, స్నేహిత ఎన్జీవో ప్రతినిధి కే స్వర్ణలత, ఎంఆర్ ఫౌండర్ ప్రతినిధి పి రజని, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సాంకేతిక సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

## - విద్యార్థులకు ఘన సన్మానం - సర్పంచ్ శ్యామ్ కుమార్ చేతుల మీదుగా సన్మానం



**అమలాపురం, (రాజధాని వార్తలు):** విద్యార్థి దశ నుండే విద్యార్థులు నూతన సాంకేతిక సృజనాత్మకత కలిగి ఉండాలని తద్వారా నూతన ఆవిష్కరణలతో దేశాభివృద్ధికి పాటుపడాలని సర్పంచ్ పరమట శ్యామ్‌కుమార్ అన్నారు.ఇటువల మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో నిర్వహించిన 52వ రాష్ట్రీయ బాలల వైజ్ఞానిక ప్రదర్శనలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యార్థులు ఉత్తమ ప్రద ర్శన కనబరిచి ప్రశంసలు అందుకున్నారు. అమలాపురం రూరల్ మండలం వన్నెచింతలపూడి (సమనస) జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సోరపల్లి శశివదన, ఉండ్రాజవరపు భవ్యశ్రీలు రూపొందించిన "ఈజీ మెషిన్ టూల్" ప్రాజెక్టుకు అత్యధిక ప్రశంసలు లభించాయి. ఈ సందర్భంగా విద్యార్థులు సోరపల్లి శశివదన, ఉండ్రాజవరపు భవ్య శ్రీలను ప్రాజెక్ట్‌కు గైడ్ చేసిన పాఠశాల ప్రధానో పాధ్యాయులు గుబ్బల నాగ సత్యనారాయణను సమనస గ్రామ సర్పంచ్ పరమట శ్యామ్ కుమార్ గురువారం ఘనంగా సన్మానించారు. విద్యార్థులు విద్యతోపాటు సాంకేతిక రంగంపై మక్కువ కలిగి నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని శ్యాం కుమార్ విద్యార్థులకు సూచించారు. విద్యార్థి దశ నుండే నూతన సాంకేతికత వైపు తమ ఆలోచనలను పెంపొందించుకుంటే ఎన్నో నూతన ఆవిష్కరణలకు నాంది పలుకుతారని ప్రతి విద్యార్థి దేశ అభివృద్ధికి పాటుపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నక్కా రాజా రత్న నాగావాణి కృష్ణ, సమనస ఉప సర్పంచ్ మామిళ్ళపల్లి దొరబాబు, విద్య కమిటీ చైర్మన్ ముత్యాల బాబు, పరమట భీమ మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతులు అప్రమత్తంగా ఉండండి




**అమలాపురం, (రాజధాని వార్తలు):** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫా న్‌గా మారే అవకాశం ఉందని తుఫాను ప్రభావం కోస్తా ఆంధ్ర జిల్లాలలో ఉండే అవకాశం ఉన్నప్ప టికీ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చునని అయినప్పటికీ రైతుల అప్రమత్తంగా ఉండి తమ పంటను భద్రపరు చుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారి ఆడప ఉదయభాస్కర్ కోరారు. ఆ తుఫానుకు బిట్వా అని నామకరణం చేయడం జరిగిందని తెలిపారు.జిల్లాలో ఉన్న 204 ధాన్యం సేకరణ కేంద్రాలకు గాను 194 కేంద్రాలు 90% తెరవడం జరిగిందని తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల్లో ఉన్న దాన్యం సేకరణ కేంద్రాలకు తరలించాలని కోరరు. వాయుగుండం తుఫాన్‌గా మారే అవకాశం ఉందని రైతులు పంటను కోసేందుకు వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకొని వరి కోతల చేప ట్టాలని కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రా లకు తరలించడం లేదా భద్రపరచుకోవటం చేయా లని కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ రైతులను కోరారు. ధాన్యం సేకరణకు 2060 జిపిఆర్ఎస్ అమర్చిన వాహనాలు నిరంతరం అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. రైతులు ద్వారా సేకరించిన ధాన్యానికి తక్షణమే డబ్బులు చెల్లించటం జరుగు తుందని రైతుల అకౌంట్లో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాకు కావలసిన టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని వాటిని వినియోగించుకోవాలని ఆయన రైతులను కోరారు.

# "డ్రగ్స్" పై వ్యతిరేకంగా "అవగాహన" ర్యాలీ

## - డ్రగ్స్ వలన కలిగే అనర్థాలను తెలియజేయడమే అవగాహన ర్యాలీ ముఖ్య ఉద్దేశం : ఎస్.ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర హెూం శాఖమాత్యులు వంగలపూడి అనిత, విశాఖపట్నం రేంజ్ డి.ఐ.జి గోపీనాథ్ జెట్టి ల ఆదేశాల మేరకు డ్రగ్స్‌పై వ్యతిరేకంగా గజపతినగరంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు గజపతినగరం సబ్ ఇన్స్పెక్టర్ కే.కిరణ్ కుమార్ నాయుడు విలేకరులకు తెలియజేశారు. పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు డ్రగ్స్‌పై వ్యతిరేకంగా జరుగుతున్న ర్యాలీలో భాగంగా ఈరోజు (శుక్రవారం) ఉదయం ఎనిమిది గంటలకు గజపతినగరంలో గల భవిష్య కళాశాల నుంచి బాలాజీ పాలిటెక్నికల్ కాలేజీ వరకు సైకిల్ ర్యాలీ జరుగుతుందని కే కిరణ్ కుమార్ నాయుడు తెలియజేశారు. డ్రగ్స్ వలన కలిగే అనర్థాలు తెలియజేయడమే ఈ అవగాహన ర్యాలీ ముఖ్య ఉద్దేశం అని ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు తెలియజేశారు . సైకిల్ ర్యాలీ అనంతరం బాలాజీ పాలిటెక్నిక్ కళాశాలలో సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ సమావేశ అనంతరం సైకిల్ ర్యాలీ మానాపురం వైపుగా కొనసాగడం జరుగుతుందని ఎస్.ఐ కే కిరణ్ కుమార్ నాయుడు తెలియజేశారు.

# పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్న అంచనాల కమిటీ





**విజయనగరం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్ వి.జోగేశ్వరరావు, సభ్యులు నిమ్మక జయకృష్ణ, పివివి సూర్యనారాయణరాజు, డిప్యూటీ కార్యదర్శి రాజ్‌కుమార్, శ్రీ పైడితల్లి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వనం గుడివద్ద ఆలయ ఈఓ కె.శిరీష ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, పూజారులు అధికార లాంఛనాలతో కమిటీ సభ్యులకు స్వాగతం పలికారు. ప్రత్యేక ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.

# సీతంలో సారధి ఫైనాన్స్ పూల్ క్యాంపస్ ఇంటర్న్‌షిప్ & ప్లేస్‌మెంట్ డ్రైవ్





**విజయనగరం, (రాజధాని వార్తలు):** సీతం కాలేజ్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో డిగ్రీ మరియు పీజీ విద్యార్థుల కోసం సారధి ఫైనాన్స్ సంస్థతో కలిసి పూల్ క్యాంపస్ ప్రీ-ప్లేస్‌మెంట్ టాక్, ఇంటర్న్‌షిప్ & ప్లేస్‌మెంట్ డ్రైవ్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ డ్రైవ్‌లో ఎంపికైె విద్యార్థులు ఇంటర్న్‌షిప్ మరియు ప్లేస్‌మెంట్ అవకాశాలను పొందారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి సారధి ఫైనాన్షియల్ సర్వీసెస్ కంట్రీ హెడ్ సంగీతా మజుందార్ విస్తృతమైన కెరీర్ అవకాశాలు ఉన్నాయని విద్యార్థుల అందిపుచ్చుకోవాలని సూచించారు. సీతం డైరెక్టర్ మజ్జి శశిభూషణ రావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను బలోపేతం చేసుకొని, పూల్ క్యాంపస్ డ్రైవ్‌లను కెరీర్ నిర్మాణానికి ఉపయోగించుకోవాలని ప్రోత్సహించారు. సీతం ప్రిన్సిపాల్ డా. డి.వి.రామమూర్తి మాట్లాడుతూ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించడంలో ఇలాంటి ప్లేస్‌మెంట్ కార్యక్రమాలు కీలకమని, విద్యార్థులు నిరంతరం నేర్చుకునే దృక్పథంతో ఉండాలని పేర్కొన్నారు. మేనేజ్‌మెంట్ స్టడీస్ హెచ్‌ఓడి డా.ఎస్.వరూధిని మాట్లాడుతూ విద్యార్థుల ఉద్యోగ నైపుణ్యాల అభివృద్ధి కోసం విభాగం తరచుగా పరిశ్రమ - అకాడెమిక్ అనుసంధాన కార్యక్రమాలను కొనసాగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# బీర ధనంజయ్‌ను పరామర్శించిన వైస్సార్సీపీ సీనియర్ నాయకులు కుంచే రమణారావు

**డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నియోజకవర్గం ఉప్పలగుప్తం, (రాజధాని వార్తలు):** చల్లపల్లి ఎరుబండిచెరువు మాజీ ఎంపీటీసీ బీరా ధనంజయ్ అనారోగ్యంతో బాధ పడుతున్నారు. విషయం తెలుసుకున్న వై.యస్. ఆర్‌సీపీ అమలాపురం నియోజకవర్గ సీనియర్ లీడర్, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఛైర్మన్ కుంచే రమణారావు వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ధనంజయ్ ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యుల నుంచి తెలుసుకుని, వారికి వైద్య నిమిత్తం 10,000/- వేలు చెక్కును అందించారు. ధనంజయ్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని రమణారావు ఆకాంక్షించారు. ధనంజయ్‌కి ధైర్యం చెబుతూ, అవసరమైన సమయంలో ఎలాంటి సహాయం కావాలన్నా అందిస్తామని రమణారావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పినిపే జయరాజు, బీర రమేష్, పరమట పండు. కాట్రు



మధు, సాధనాల శ్రీను, నక్క సంపత్, నేరేడుమిల్లి శ్రీను, గంట ప్రసాద్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా సైనిక సంక్షేమాధికారిగా కృష్ణారావు బాధ్యతలు స్వీకరణ



**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరం, పార్వతీపురం ఉమ్మడి జిల్లాల సైనిక సంక్షేమాధికారిగా మజ్జి కృష్ణారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఇంతకుముందు కూడా జిల్లాలో సైనిక సంక్షేమాధికారిగా పనిచేసిన అనుభవం ఉంది. ఇప్పటివరకు ఇక్కడ సైనిక సంక్షేమాధికారిగా పనిచేసిన కెవిఎస్ ప్రసాదరావు పశ్చిమగోదావరి జిల్లా అధికారిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బాధ్యతలను స్వీకరించిన కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ ఎస్.సేథు మాధవన్‌ను, డియార్వో శ్రీనివాసమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బాధ్యతలను స్వీకరించిన కృష్ణారావును పలువురు మాజీ సైనికులు, వీరనారీమణులు, సంక్షేమ సంఘం నాయకులు, సిబ్బంది అభినందించారు.

# భద్రాచలం గ్రామపంచాయతీ ఎన్నికల హడావుడి





**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దక్షిణాది పుణ్యక్షేత్రమైన భద్రాచలం గ్రామపంచాయతీలో ఎన్నికల హడావుడి కొనసాగుతుంది. 2025 డిసెంబర్ నెలలో జరగబోయే గ్రామపంచాయతీ స్థానిక ఎన్నికలలో గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా ముందుకు వెళ్లాలని ఆలోచనతో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను గెలిపించే విధంగా జనసేన పార్టీ బలపరచిన అభ్యర్థులు కీలక పాత్ర పోషించుచున్నారు. భద్రాచలం గ్రామపంచాయతీ సుమారు ఐదు నుండి ఆరు వార్డులకు పోటీ చేస్తున్న తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు కాబోయే సర్పంచులకు కీలకంగా మారనున్నారు. ఈ సందర్భంగా నామినేషన్ అనంతరం భద్రాచలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఖమ్మంపాటి సురేష్ కుమార్ రాజా బ్రదర్స్, ప్రముఖ న్యాయవాది శ్రీనివాస్,



అభినేని శ్రీనివాస్, పక్కన శ్రీనివాస్, వారి సతీమణులు వార్డు మెంబర్లుగా పోటీ చేసి కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది అని పలువురు విశ్లేషకులు వాపోతున్నారు.

# గతంలో పట్టుబడిన 12 మందిపై బైండోవర్ కేసులు

## - గ్రామాలలో ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు : సీ.ఐ జే.జనార్ధన్ రావు





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల గజపతినగరం మండలంలోని వివిధ బెల్ట్ షాపుల కేసుల్లో గతంలో పట్టుబడిన 12 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు స్థానిక ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జె.జనార్ధన్ రావు గురువారం తెలిపారు. బైండోవర్ కేసులలో ఉన్న వారిని గురువారం గజపతినగరం తాసిల్దార్ బి.రత్నకుమార్ ఎదుట హాజరు పరచగా బి.ఎన్.ఎస్.ఎస్ (28) చట్ట ప్రకారం ఇద్దరిని, (29) చట్ట ప్రకారం పదిమంది వద్ద నుంచి సంవత్సర కాలానికి రెండు లక్షల రూపాయల బాండులను తీసుకుని బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. గ్రామాల్లో ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహించిన బెల్ట్ షాపులు నిర్వహణకు వేలంపాటలు చేపట్టిన కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా సీ.ఐ జే.జనార్ధన్ రావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పి.శాంతిలక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ ఎండిజే భాష, బి.గంగాధరుడు పాల్గొన్నారు.

# నేత్ర శిబిరాలు అన్ని నియోజకవర్గాలకు విస్తరింప చేయాలి

## - కంటి వైద్య శిబిర ప్రారంభంలో ఎంపీ తంగెళ్ల





**సామర్లకోట, (రాజధాని వార్తలు):** నేత్రాలయ కంటి వైద్యశాల నిర్వహిస్తున్న ఉచిత కార్నియా వైద్య శిబిరాలను జిల్లాలోని అన్ని నియో జకవర్గాలకు విస్తరింప చేయాలని కాకినాడ ఎంపీ తంగళ్ళ ఉదయ శ్రీనివాస్ కోరారు. సామర్లకోట శ్రీ భీమేశ్వర ఆలయం వద్ద శంకర నేత్రాలయ కంటి వైద్యాశాల, ఎర్నేని కుటుంబం, నటరాజ నాట్యాంజలి (అమెరికా)ల సహకారంతో డిసెంబర్ 3వ తేదీ వరకు జరగనున్న ఉచిత కంటిపొర చికిత్స శిబిరాన్ని గురువారం ఎంపీ ఉదయ శ్రీనివాస్ పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల రాజప్ప డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)లు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శరీర అవయవాల్లో కన్ను అతి ప్రధానమైనది అయినం దున కంటి చూపులు కాపాడుకునే విషయంలో ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపించాలన్నారు. నిరుపేదల కోసం నేత్రాలయ కంటి వైద్యశాల, ఎర్నేని కుటుంబం, నటరాజ నాట్యాంజలి ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎంతో వ్యయంతో కూడినటువంటి ఈ శిబిరాన్ని పేద ప్రజల కోసం కేవలం ఉచితంగా అందించడంతో పాటు నెల రోజుల తర్వాత కూడా వారికి పరీక్షలు జరిపి, కంటి ఆరోగ్యాన్ని పరిశీలించే విలువైన సేవలు అందించడం గర్వకారణం అన్నారు. ఇలాంటి శిబిరాలను రానున్న రోజుల్లో కాకినాడ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు విస్తరింప చేయాలని ఈ సందర్భంగా వారు నిర్వాహకులను కోరారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు అవసరైన వారికి డిసెంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు సుమారు రూ. 5 కోట్ల విలువుగల అత్యాధునికమైన బస్సులలో కంటి ఆపరేషన్లు నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు గడ్డమనుగు శివ, కండూరి శ్యామ్, మీసాల సునీత ధర్మకర్తల మండలి ఛైర్మన్ కంటే జగదీష్ మోహన్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బల్ల నీలకంఠం, కూటమి నాయకులు విత్తనాల వెంకటరమణ, బడుగు శ్రీకాంత్, సరోజ వాసు, అడబాల కుమారస్వామి, ధర్మకర్తల మండలి సభ్యులు చీమలకొండ వీరభద్ర ప్రసాద్ రావు, తాతపూడి సత్య అరుణ్ వంశీ, గోల్తి సత్యనారాయణ, కంచర్ల సుష్మా మోహిని తదితరులు పాల్గొన్నారు. ఇంకా శిభిరంలో కంటి పరీక్షలు కోసం వందల సంఖ్యలో ప్రజలు విచ్చేసి పాల్గొన్నారు.

# సంపాదకీయం

## బంధమా బతుకా దాంపత్యంలో ఏది ముఖ్యం

ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్) హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఒక తీర్పు హిందూ మహిళలకు భారత రాజ్యాంగ నీతి పూర్తిగా వర్తించే స్థితి ఇంకా ఏర్పడలేదని చాటుతున్నది. వివాహబంధంలో ఉండగా భర్త నుంచి విడిపోయి వేరొక పురుషునితో సహజీవనం చేస్తున్న మహిళకు ఆ మాజీ భర్త నుంచి, అతడి తరపు పోలీసు జోక్యం నుంచి రక్షణ కల్పించడానికి తిరస్కరిస్తూ నవంబర్ 15న ప్రయాగ్‌రాజ్ హైకోర్టు తీర్పు చెప్పింది. పురుషాధిక్య ఆధిపత్య భావజాల స్ఫూర్తితో రూపొందిన 1955 నాటి హిందూ వివాహ చట్టాన్ని ఉల్లంఘించడం సాధ్యం కాదని ఈ తీర్పు అర్థం. భర్తల దుర్మార్గం నుంచి రక్షణ కోసం, వైవాహిక 'జైలు' నుంచి తప్పించుకొని పారిపోయేవారిని మెడపట్టుకొని తిరిగి ఆ జైలుకే పంపించడం మానవీయమా? "వర్గానికి వర్గానికి మధ్య, స్త్రీ పురుషుల మధ్య (జెండర్ల మధ్య) అసమానత హిందూ సమాజం ఆత్మ. దానిని విడిచిపెట్టి ఆర్థిక సమస్యలకు సంబంధించిన చట్టాలు చేసుకొంటూపోవడం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమే. పేడకుప్ప పైన మేడ కట్టడమే," అని అంబేద్కర్ తన హిందూ కోడ్ బిల్లును పార్లమెంట్ తిరస్కరించినప్పుడు మంత్రి పదవి నుంచి తప్పుకొంటూ సమర్పించిన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. మహిళను విముక్తం చేయడమన్న తన లక్ష్యం నెరవేరనందుకు నిరసనగానే అంబేద్కర్ రాజీనామా చేశారు. సంప్రదాయ హిందూ సమాజంలో మహిళది రెండవ స్థాయి పౌరసత్వమే. దాని నిర్మాణం ప్రకారం ఆమె బతుకు ఆశయం పురుషుడి అడుగులకు మడుగులొత్తడమే. మన దేశాన్ని ఇప్పుడు పరిపాలిస్తున్న శక్తుల గురువైన ఆరెస్సెస్ సంస్థ అధినేత మోహన్ భగవత్ చెప్పిన ధర్మ సూత్రమూ ఇదే. భర్తకు సేవ చేయడమే భార్య పని అని 2013 జనవరిలో ఆయన స్పష్టంగా చెప్పారు. పురుషునితో ఆమెకు గల సామాజిక ఒప్పందం ప్రకారం ఆమె ఇంటి పనులకి పరిమితం కావాలి. పురుషుడు బయటి బాధ్యతలు చూసుకుంటూ ఉండాలి. ఇలా ఇంటి ఇంతిగా ఆమె అతడిని సంతృప్తి పరచడంలో విఫలమైన వెంటనే ఆమె పోషణ బాధ్యత నుంచి అతడు తప్పుకోవచ్చని, అక్కడితో భార్య భర్తల మధ్య సామాజిక కాంట్రాక్టు ముగిసిపోతుందని భగవత్ అభిప్రాయపడ్డారు. ఆడవారిపై లైంగిక అత్యాచారాలు దేశంలోని గ్రామీణ ప్రాంతాలలో అరుదుగాను, పట్టణ ప్రాంతాలలో తరచుగానూ సంభవిస్తున్నాయని ఆయన అంతకు ముందు అన్నారు. అంటే సంప్రదాయ సమాజం గట్టిగా వేళ్లూనుకుని ఉన్న గ్రామాల్లోనే మహిళ సురక్షితంగా బతుకుతున్నదని, ఆధునిక పురోగామి పట్టణ సమాజంలోనే ఆమెకు భద్రత కరువైందని ఆయన నొక్కి వక్కాణించారన్నమాట. పురాతన హిందూ సమాజం ఈ విలువలనే ఇప్పటికీ పాటిస్తున్నది. హిందూ వివాహచట్టంలోని 9వ సెక్షన్ ఈ పునాదుల పైనే నిర్మితమైంది. భార్య, భర్త విడిపోయిన తర్వాత ఒకరిపై ఒకరు దాంపత్య హక్కుల పునరుద్ధరణను కోరుతూ కోర్టుకు వెళ్లే అవకాశాన్ని హిందూ వివాహ చట్టంలోని 9వ సెక్షన్ ఉభయులకూ కల్పిస్తున్నది. ఆయా పరిస్థితులను పరిశీలించి కోర్టు ఆ హక్కును పునరుద్ధరించవచ్చునని పేర్కొంటున్నది. వైవాహిక అక్రమ వర్తనకు పాల్పడి భాగస్వామికి దూరంగా బతుకుతుంటే అటువంటి భార్య లేదా భర్తపై తనకుగల లైంగికత సహా సంపూర్ణ దాంపత్య హక్కును తిరిగి కల్పించాలని కోరుతూ జిల్లా కోర్టుకు వెళ్లే హక్కును 9వ సెక్షన్ కల్పిస్తున్నది. ఇది నిజానికి భార్యా భర్తా సమానులన్న అభిప్రాయం నుంచి ఉత్పనమైనది. కానీ వాస్తవంలో ఇప్పటికీ భర్తది పైచేయి, భార్యది కింది చేయిగానే ఉన్నది. భర్తతో బాటు అతడి తల్లి, తండ్రి, సోదరులు, ఆడపడుచులు కూడా ఆమెపై పెత్తనాన్ని, హింసాయుతమైన అణచివేతను అమలు చేస్తున్నారు. అందుచేత భార్య తనకు దూరమైన తన భర్తను తిరిగి తన దగ్గరకు చేర్చుకొనేలా దాంపత్య హక్కు పునరుద్ధరణను అర్థించడానికి, అదే పనిని భర్త స్థానంలోని వ్యక్తి చేయడానికి చాలా తేడా ఉంది. రాజ్యాంగం హామీ ఇస్తున్న వ్యక్తిగత, జీవన స్వేచ్ఛలు తిరుగులేనివి కావని, విడాకులు తీసుకోనందున ఆమెపై తన మాజీ భర్తకు ఇంకా హక్కు ఉంటుందని అలహాబాద్ తీర్పు స్పష్టం చేసింది. మహిళ తాను కోరుకొన్నట్టు వేరొకరితో ఉండాలీ అనుకొంటే భర్త నుంచి విడాకులు తీసుకోవాలని ఆ మహిళకు దిక్కు చూపింది. హిందూ వివాహ చట్టం 9వ సెక్షన్ మహిళకు శాపం వంటిదని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎ.చౌదరి 1983 జూలైలో చలన చిత్ర నటి సరిత, వెంకట సుబ్బయ్య కేసులో తీర్పు ఇచ్చారు. ఈ సెక్షన్‌ను రద్దు చేస్తూ, ఇది జంటల వ్యక్తిగత గోప్యత హక్కును కాలరాస్తున్నదని, వివాహ బంధాన్ని కాపాడే నెపంతో పౌరుల ప్రాథమిక హక్కులను హరిస్తున్నదని జస్టిస్ చౌదరి తన తీర్పులో స్పష్టం చేశారు. అయితే జస్టిస్ చౌదరి విప్లవాత్మక తీర్పును సుప్రీంకోర్టు ఆ తర్వాత రద్దు చేసింది. అప్పటి నుంచి వివిధ కోర్టులు వివాహిత మహిళలకు విషం వంటి ఈ 9వ సెక్షన్‌ను ఆమె చేత బలవంతంగా తాగిస్తున్నాయి. పెళ్లి అనే వ్యవస్థను కాపాడాలని, భార్యాభర్తలు ఆ బంధానికి జీవిత కాలమంతా కట్టుబడి ఉండాలని 9వ సెక్షన్ కోరుతున్నది. కాని మహిళ అక్షరాస్యతలోనే కాదు విద్యాబుద్ధులు, ఆధునిక నిపుణతలలోనూ పురుషునితో సమానమైన స్థాయికి చేరుకొంటున్న వర్తమానంలో ఇష్టంలేని మగవానితో కలిసి కాపురం చేయవలసిన అగత్యాన్ని ఆమె ధైర్యంగా ఎదిరిస్తోంది. అసలు పెళ్లినే కాదని ఇష్టపూర్వక సహజీవనాన్ని సాగించే జంటల సంఖ్య పెరుగుతున్నది. చదువుకున్న, స్వతంత్ర వ్యక్తిత్వమూ చైతన్యమూ గల పలువురు స్త్రీలు సంప్రదాయ వివాహ వ్యవస్థను తృణీకరిస్తున్నారు. ఒంటరి జీవనాన్ని కోరుకొనే మహిళలు ఎక్కువవుతున్నారు. వివాహేతర సహజీవన బంధం అక్రమమైనది, న్యాయవిరుద్ధమైనది కాదని కూడా సుప్రీంకోర్టు నిర్ధారించింది. సహజీవన జంటలకు పుట్టే పిల్లలకు ఆస్తి హక్కు ఉంటుందని ప్రకటించింది.

# ఘనంగా "బాల్య వివాహ ముక్త భారత్"




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ట్రస్ట్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సంయుక్తంగా చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సామర్లకోట మండలం మాధవ పట్నం జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్‌లో బాల్య వివాహ ముక్త భారత్ ప్రతిజ్ఞ, ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ జి.ఉష, గ్రామ సర్పంచి యమ్ సుగుణమ్మ, యమ్‌పిటిసి జి కృష్ణ అర్జునరావులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిడిపివో ఉష మాట్లాడుతూ నవంబర్ 27, 2024 నుండి "బాల్య వివాహ ముక్త భారత్" అనే కార్యక్రమం ప్రారంభించడం జరిగిందన్నారు. దేశంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బాల్య వివాహ నిరోధ చట్టం 2006 ప్రకారం బాల్యవివాహాలు ఒక సాంఘిక దురాచారం నేరం, బాల్య వివాహాలు బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకమే కాకుండా వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలను దూరం చేస్తుందన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సాధ్యమైన ప్రతి ప్రయత్నం చేయాలన్నారు. బాల్య వివాహం జరగడానికి చేసిన ఏ ప్రయత్నాన్నైనా పంచాయతీ, ప్రభుత్వ అధికారులకు తెలియపరచాలని లేదంటే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా 27 నవంబర్ 2025 నుండి 8 మార్చ్ 2026 వరకు 100 రోజుల అవగాహన కార్యక్రమాలును క్రాఫ్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించడం జరుగుతుందన్నారు. బాల్య వివా హాలు జరగకుండా కాపాడాల్సిన బాధ్యత సమాజ ములో అందరిపైన ఉందన్నారు. ఎవరైనా బాల్య వివాహాలను ప్రోత్సహించిన మరియు సహకరించిన లేదా 18 సంవత్సరాలు అమ్మాయికి నిండకుండా, 21 సంవత్సరాలు పూర్తి కాకుండా అబ్బాయికి వివాహం చేసిన బాల్య వివాహ నిషేధ చట్టం 2006 ప్రకారం లేదా పోక్సో చట్టం చర్యలు తీసుకుంటామని తెలియజేసారు. బాలల విద్య, భద్రత కోసం ప్రతీ పౌరుడు గళాన్ని వినిపించాలని, బాల్య వివాహ ఆంధ్రప్రదేశ్ సాకారానికి మద్దతు ఇవ్వాలని అన్నారు. అందులో బాగంగానే ఈరోజు జిల్లాలోని అన్ని గ్రామాలలో క్యాండిల్ లైట్ ర్యాలీ, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ కమ్యూనిటీ సోషల్ వర్కర్ బి లక్ష్మి, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు, సూపర్వైజర్ నళిని, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజలందరికీ గోదావరి రక్షిత జలాలు

### - గోదావరి పైపులైన్ ప్రాజెక్టుకు ఎమ్మెల్యే శంకుస్థాపన

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** గోదావరి రక్షిత జలాలను గ్రామాల్లోని ఇంటింటికి, ప్రజలందరికీ చేరవేసే లక్ష్యంతో భారీ పైపులైన్ ప్రాజెక్టు పనులు చేపట్టినట్లు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, బీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) లు పేర్కొన్నారు. సామర్లకోట మండలం పనసపాడు గ్రామంలో "జల్ జీవన్ మిషన్" నిధులు రూపాయలు రూ. 1650 కోట్లు వ్యయంతో చేపట్టనున్న పైప్ లైన్ నిర్మాణం పనులకు గురువారం సాయంత్రం ఎమ్మెల్యే చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబులు కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు రూరల్ వాటర్ సప్లై శాఖ ఆధ్వర్యంలో ధవలేశ్వరం నుండి సామర్లకోట సహా పరిసర గ్రామాలకు స్వచ్ఛమైన గోదావరి నీరు అందించేందుకు ప్రభుత్వం కీలక కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ ప్రాజెక్టుకు రూ. 1650 కోట్ల భారీ నిధులు కేటాయించగా, మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పైపులైన్ ఏర్పాటు, ఇతర నిర్మాణ పనులను చేపట్టనుందన్నారు. రెండేళ్లలోగా మొత్తం పనులు పూర్తిచేసి ప్రతి ఇంటికీ గోదావరి రక్షిత నీరు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. ధవలేశ్వరం వద్ద ప్రాజెక్టుకు చెందిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మించి అక్కడ నుంచి నేరుగా ఫిల్టర్ జలాలను గ్రామాలకు అనుసంధానం చేస్తూ పైప్ లైన్ల ద్వారా పంపనున్నారు. మండలంలోని ఉండూరు, పెద్ద బ్రహ్మదేవం గ్రామాల వద్ద గోదావరి జలాల పైప్ లైన్‌ల ఇన్‌లెట్‌లు



ఏర్పాటు చేయ డం జరుగుతుందన్నారు. పనసపాడు దేవి ఫిషరీస్ పరిశ్రమ సమీపంలో ఏర్పాటు చేసిన ఈ పబ్లిక్ వాటర్ స్కీమ్ శంకుస్థాపన కార్యక్రమం ఏపీ ఎన్జీవో కాలనీ పంచాయతీ సామాజిక స్థలంలో జరిగింది. గ్రామానికి అదనంగా ఒక కొత్త వాటర్ ట్యాంక్‌ను కూడా ప్రభుత్వం శాంక్షన్ చేసినట్లు చెప్పారు. అలాగే పి వేమవరం గ్రామంలో రూ. 49.50 లక్షలు వ్యయంతో నిర్మించిన వాటర్ ట్యాంక్ పనులను ఎమ్మెల్యే రాజప్ప ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో గ్రామ సర్పంచి చీకట్ల వెంకటేష్, కూటమి నాయకులు విత్తనాల వెంకటరమణ, నూనె రామారావు, అందుగుల జార్జి చక్రవర్తి, సామర్లకోట మండల టిడిపి అధ్యక్షుడు ముసిరెడ్డి శ్రీరాములు, ఆర్డబ్ల్యూఎస్ డి ఈ ఎన్ ఎస్ స్వామి, ఏఈ సుభాషిని, ఉండూరు సొసైటీ అధ్యక్షుడు బచ్చుల జేమ్మి పనసపాడు పంచాయతీ వార్డు సభ్యులు, బూత్ ఇన్‌చార్జిలు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్‌లో శ్రీ ప్రకాష్ విద్యార్థిని ప్రతిభ



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి బాస్కెట్బాల్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించారు. ఇదివరకు పాఠశాల డైరెక్టర్ రవి ప్రకాష్ గురువారం తెలుపుతూ పాఠశాలలో 8వ తరగతి చదువుచున్నదాడి కమల వైష్ణవి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా జరిగిన బాస్కెట్ బాల్ ఎంపిక పోటీలలో పాల్గొని, జిల్లా జట్టు తరపున చిత్తూరు జిల్లా మదనపల్లిలో ఈనెల 24 నుండి 26వ తేదీ వరకు జరిగిన "69వ" ఎస్.జి.ఎఫ్.ఐ అంతర్ జిల్లాల అండర్-14 బాలికల విభాగంలో బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో పాల్గొని జట్టులో అత్యంత ప్రతిభను కనపరచ్చినట్లు తెలిపారు. దాని కిగానూ కమల వైష్ణవి సిల్వర్ మెడల్ పొంది ద్వితీయ స్థానాన్ని సాధించిందన్నారు. తమ పాఠశాల తరపున రాష్ట్రస్థాయిలో వెండి పతకం సాధించిన విద్యార్థినిని, ఆమెకు శిక్షణను ఇచ్చిన కోచ్‌ను శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాల డైరెక్టర్ సిహెచ్. విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎమ్.వి.వి.ఎస్.మూర్తి, పాఠశాల అకాడమిక్ కోఆర్డినేటర్ ప్రశాంతి, కల్చరల్ కోఆర్డినేటర్ ఉషా చైతన్య, ఉపాధ్యాయులు అభినందించారు.

# ఘనంగా కందుల బద్రీనాథ్ పుట్టినరోజు వేడుకలు

### - అరుణాచలం లింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు కుమారుడు కందుల బద్రీనాథ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేరెళ్ల కోనేరు ప్రాంతంలో గల అరుణాచల లింగేశ్వర శివాలయంలో బద్రీనాథ్, సుప్రియ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయానికి శఠగోపం, ఉద్ధరిణి, పళ్లెం బహూకరించారు. ఈ సందర్భంగా పలువురికి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కందుల నాగరాజు, కందుల కేదార్నాథ్, స్వాతి దంపతులు, కుటుంబ సభ్యులు, కేఎన్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు



తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవింగ్ సమయంలో ఏకాగ్రతను కోల్పోవద్దు



**అమలాపురం, (రాజధాని వార్తలు):** వాహనాలను నడిపే డ్రైవింగ్ వృత్తి అత్యంత బాధ్య తాయుతమైనదని డ్రైవింగ్ సమయంలో ఏకాగ్రతను కోల్పోరాదని జిల్లా రవాణా శాఖ అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. అమలాపురం ఏపీఎస్ ఆర్టీసీ డిపోలో గురువారం నిర్వహించిన హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 16 మంది అభ్యర్థులతో 12వ బ్యాచ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. డ్రైవర్‌లు కదిలే దేవుళ్ళని ఎంతో మంది ప్రాణాలు వారి చేతుల్లో ఉంటాయని గుర్తుంచుకొని ఏకాగ్రత, మానసిక ప్రశాంతతతో డ్రైవింగ్ చేయాలన్నారు. డ్రైవింగ్ విధానంపై ఈ శిక్షణా తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. జిల్లా ప్రజా రవాణాధికారి ఎస్టీపీ రాఘవకుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ శిక్షణ కళాశాలలో డ్రైవర్లకు ప్రాక్టికల్ శిక్షణతో పాటు బస్సు మెయింటినెన్స్ విషయాల పట్ల అవగాహన కల్పిస్తారన్నారు. డిపో మేనేజర్ డి.ఎల్. ఎన్.శర్మ, ఎస్సీ వెల్ఫేర్ కార్పొరేషన్ ఈడీ జె.సత్యవతి చేతుల మీదుగా అభ్యర్థులకు డ్రైవింగ్ శిక్షణా పాఠ్య పుస్తకాలను అందజేసారు. అతి త్వరలో 13వ బ్యాచ్ శిక్షణా తరగతులు ప్రారంభం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్యారేజ్ ఇంచార్జ్ జిఆర్ఎల్ దేవి, ట్రాఫిక్ ఇంచార్జ్ ప్రతిమాకుమారి, ఓపీఆర్ఎస్ ఎన్.వరహాల బాబు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

# టిడ్ కో లబ్దిదారులకు ఈజీ హోమ్ లోన్స్



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట పురపాలక సంఘంలో ఎండి టిడ్కో హౌసింగ్ అధికారుల ఆధ్వర్యంలో టిడ్కో లబ్ధిదారులకు ఈజీ హోమ్ లోన్స్ వారి ద్వారా లోను మంజూరు చేయుట కొరకు మెప్మా కార్యాలయంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎ శ్రీవిద్య పాల్గొని మాట్లాడుతూ సామర్లకోట పట్టణంలో రుణాలు మంజూరు కాకుండా 350 మంది లబ్ధిదారులు మిగిలి ఉన్నారన్నారు. వివిధ కారణాల వలన గతంలో వీరికి బ్యాంకు లోన్లు మంజూరు కాలేదని, ప్రస్తుతం వీరికి ఈజీ హోమ్ లోన్ వారిచే రుణాలు అందించేందుకు వారు ముందుకు వచ్చినట్టు చెప్పారు. ఇప్పటి వరకు రుణాలు పొందని లబ్ధిదా రులు ఈనెల 27, 28, 29 తేదీలలో మెప్మా కార్యాలయంలో రుణ మంజూరు కోసం సంప్రదించాలన్నారు. ఈ అవకాశం లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కమిషనర్ శ్రీవిద్య తెలిపారు. ఈ సమావేశమునకు ఈజీ లోన్ సేల్స్ మేనేజరు, గాంధీ, టిడ్కో సిఎల్ టి సి రత్న, మెప్మా సీఎం ఏం సయ్యద్ హుస్సేన్, సి ఓ లు బి వెంకట లక్ష్మి, వై వెంకట లక్ష్మి, డి అరుణ, టీ ఎల్ ఎఫ్‌ఆర్‌పి, ఎస్‌ఎల్‌ఎఫ్‌ఆర్‌పిలు, టిడ్కో లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఉడిపిలో లక్ష కంఠ గీతా పఠనం.. హాజరైన మోదీ

**ఉడిపి:** రామజన్మభూమి ఉద్యమంలో ఉడిపి ప్రాంతం పాత్ర ప్రశంసనీయమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. శ్రీ విశ్వేశ తీర్థ స్వామి మార్గదర్శకంలో ఆలయ ఉద్యమం ఈరోజు అయోధ్యలో రామమందిరంపై పతాకావిష్కరణ వరకూ దారి తీసిందని కొనియాడారు. ఉడిపిలోని ప్రసిద్ధ శ్రీకృష్ణ మఠాన్ని ప్రధాని శుక్రవారంనాడు సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన లక్ష కంఠ భగవద్గీత పఠనంలో పాల్గొన్నారు. అనంతరం ప్రధాని మాట్లాడుతూ, ఉడిపి రావడం తనకు ఎంతో ప్రత్యేకమైనదిగా భావిస్తున్నానని అన్నారు. మరో కారణం కూడా ఉందని చెప్పారు. జన్‌సంఘ్‌కు ఇది కర్మభూమి అని, బీజేపీ సుపరిపాలనా మోడల్‌కు ప్రేరణ అని చెప్పారు. 1968లో ఇక్కడి మున్సిపల్ కౌన్సిల్‌కు జన్‌సంఘ్ నేత వీఎస్ ఆచార్యను ఎన్నుకున్నారని గుర్తు చేశారు. ఐదు దశాబ్దాల క్రితమే ఉడిపిలో న్యూ గవర్నెన్స్ మోడల్‌కు పునాదులు పడ్డాయని, జాతీయ విధానాలకు మార్గదర్శకంగా ఉడిపి నిలిచిందని అన్నారు. విశ్వేశ తీర్థ స్వామీజీ అయోధ్య ఆలయ ఉద్యమానికి మార్గదర్శకం చేశారని చెప్పారు. అది ఈరోజు అయోధ్యలో పతాక ఆవిష్కరణ దారి తీసిం దని అన్నారు. మూడ్రోజుల క్రితమే తాను భగవద్గీత పుట్టిన కురుక్షేత్ర గడ్డపై ఉన్నానని, ఈరోజు శ్రీకృష్ణ భగవానుడు, శ్రీ జగద్గురు మధ్వాచార్య ఆశీస్సులతో తాను ఇక్కడికి రావడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. లక్ష కంఠ భగవద్గీత పారాయణలో ప్రధాని తన గొంతు కలిపారు.

**కనక మండప దర్శనం**

ప్రధాని తన పర్యటనలో చారిత్రక కనక మండపాన్ని దర్శించారు. 14-15వ శతాబ్దం నాటి ప్రఖ్యాత సంకీర్తనాచార్యులు కనకదాసుకు ప్రధాని పుష్పాంజలి ఘటించారు. అనంతరం శ్రీకృష్ణ టెంపుల్ కాంప్లెక్స్‌కు వెళ్లారు. పర్యాయ పుతిగే మఠాధిపతి శ్రీ సుగుణేంద్ర స్వామి, మఠం దివాన్, సీనియర్ అధికారులు ప్రధానికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. వెండి పొదిగిన తులసీ మాల, ముద్రలను ప్రధా నికి అందజేశారు. ఉడిపి శ్రీకృష్ణుడి ఆలయాన్ని ప్రధాని దర్శించు కోవడం ఇది రెండోసారి. గుజరాత్ ముఖ్యమంత్రిగా 2008లో తొలిసారి ఆయన ఇక్కడకు వచ్చారు.


# మతిపోగొట్టే శోభిత లుక్స్



టాలీవుడ్‌లో ఎక్కువ సినిమాలు చేయకున్నా శోభితా ధూళిపాళ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయనక్కర్లేదు. ఎందుకంటే శోభిత అక్కినేని వారి ఇంటి కోడలు అనే విషయం తెల్సిందే. నాగ చైతన్యను వివాహం చేసుకున్న తర్వాత, చేసుకోక ముందు కూడా శోభితా తనకంటూ ప్రత్యేక ఇమేజ్ సొంతం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉంది. బాలీవుడ్‌లో ఈమెకు మంచి ఆఫర్లు లభించాయి, తద్వారా ఇప్పటికే బాలీవుడ్‌లో గుర్తింపు ఉన్న హీరోయిన్స్ జాబితాలో చేరింది. అంతే కాకుండా ఇతర భాషల్లో కూడా ఈమె సినిమాలు చేసిన కారణంగా అన్ని చోట్ల మంచి పాపులారిటీని సొంతం చేసుకుంది. తెలుగు అమ్మాయి అయినప్పటికీ ఇతర భాషల్లో ఎక్కువగా శోభితా కనిపించడం తెలుగు వారికి గర్వించదగ్గ విషయం అనడంలో సందేహం లేదు. నాగ చైతన్యతో వివాహం తర్వాత కూడా శోభిత వరుస ప్రాజెక్ట్‌లు కమిట్ అవుతూనే ఉంది. తెలుగులో నాగ చైతన్యతో కలిసి శోభిత ఒక సినిమా చేయాలని అక్కినేని ఫ్యాన్స్ బలంగా కోరుకుంటున్నారు. ప్రస్తుతానికి అలాంటి చర్చలు ఏమీ లేవు. కానీ భవిష్యత్తులో చేయాలని అనుకుంటున్నట్లుగా మాత్రం వార్తలు వస్తున్నాయి. ఆ విషయాన్ని వారు అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. గత ఏడాది కాలంగా కొత్త సినిమాలతో రాని శోభిత వచ్చే ఏడాదిలో బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్ట్‌లతో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతానికి ఒక హిందీ సినిమా, ఒక వెబ్ సిరీస్ లో ఈమె నటిస్తున్నట్లు సమాచారం అందుతోంది. ఇక రెగ్యులర్‌గా సోషల్ మీడియాలో ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో శోభిత తన అందమైన ఫోటోలు, ఫ్యామిలీ ఫోటోలు, సినిమాలకు సంబంధించిన విషయాలను షేర్ చేసుకోవడం మనం చూస్తూనే ఉన్నాం. తాజాగా మరోసారి ఈమె తన అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. బ్లాక్ టాప్‌తో పాటు, బ్లూ జీన్స్ ధరించిన శోభిత అల్ట్రా స్టైలిష్‌గా కనిపిస్తోంది. అందాల ఆరబోత చేసినప్పటి కంటే ఇప్పుడు మరింత అందంగా ఈమె కనిపిస్తుంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ అమ్మడి ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. మతి పోగొడుతున్న ఈ ఫోటోలు ఆమె అందం గురించి మరోసారి చర్చ జరిగేలా చేశాయి అనడంలో సందేహం లేదు. తెలుగు అమ్మాయి అయినప్పటికీ ముంబై ముద్దుగుమ్మలకు ఏమాత్రం తగ్గకుండా అందం విషయంలో, అన్ని విషయాల్లోనూ శోభిత ముందు ఉంటుంది. అందుకే బాలీవుడ్‌లో ఏకంగా ముంబై ముద్దుగుమ్మలకు పోటీగా నిలుస్తుందని ఆమె అభిమానులు అంటున్నారు. ఈమె అందంకు తగ్గట్లుగా టాలీవుడ్‌లో, కోలీవుడ్‌లో ఆఫర్‌లు రావడం లేదు అంటూ అభిమానులు కొందరు సోషల్ మీడియా ద్వారా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2013 ఫెమినా మిస్ ఇండియా పోటీల్లో పాల్గొని రన్నరప్‌గా నిలవడం ద్వారా ఒక్కసారిగా ఈ ఫ్యాషన్ రంగం దృష్టిని ఆకర్షించింది. మిస్ ఎర్త్ 2013లో ఇండియా తరపున ప్రాతినిధ్యం వహించడం ద్వారా బాలీవుడ్‌లో పరిచయాలు ఏర్పడ్డాయి. అనురాగ్ కశ్యప్ యొక్క రామన్ రాఘవ్ 2.0 సినిమా ద్వారా నటిగా శోభితాకి ఇండస్ట్రీ ఎంట్రీ దక్కింది. అమెజాన్‌లో ఈమె చేసిన మేడ్ ఇన్ హెవన్ వెబ్ సిరీస్ సూపర్ హిట్ కావడంతో బాలీవుడ్ ప్రేక్షకులకు మరింత దగ్గర అయింది. తెలుగులో గూఢాచారి, మేజర్ సినిమాల్లో నటించి మెప్పించింది.


# మళ్లీ కన్నెత్తి చూడని దీపిక పదుకొణే– రష్మిక!





బెంగుళూరు నుంచి బాలీవుడ్‌కి వెళ్లి సక్సస్ అయిన బామలెంతమంది? అంటే ట్రెండింగ్‌లో ఉన్న ఇద్దరు భామల పేర్లు ప్రముఖంగా తెరపైకి వస్తాయి. వారే దీపికా పదుకొణే...రష్మికా మందన్నా? ఇద్దరు కర్ణాటక ప్రాంత నుంచి వెళ్లిన వారే. తొలుత ఇద్దరి జర్నీ కన్నడ పరిశ్రమలోనే ప్రారంభమైంది. సరిగ్గా రెండున్నర దశాబ్దాల క్రితం దీపకా పదుకొణే ఐశ్వర్య అనే కన్నడ చిత్రంతోనే తెరంగేట్రం చేసింది. అటుపై ఏడాది గ్యాప్‌లోనే బాలీవుడ్ చిత్రం ఓంశాంతి ఓంలో ఛాన్స్ అందుకుంది. షారుక్ ఖాన్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రంలో దీపిక హీరోయిన్‌గా నటించగా పర్హాన్ అక్తర్ తెరకెక్కించారు. ఈ ఒక్క విజయం దీపిక జీవితాన్ని రాత్రికి రాత్రే మార్చేసింది. 40 కోట్ల బడ్జెట్ సినిమా 150 కోట్లు వసూళ్లు సాధించడంతో దీపిక కెరీర్ బాలీవుడ్‌లో సెట్ అయిపోయింది. ఆ తర్వాత వచ్చిన అవకాశాలతో మంచి విజయాలు అందుకుంది. అదే సమయంలో షారుక్ ఖాన్ సెంటిమెంట్ హీరోయిన్‌గానూ మారిపోయింది. అప్పటి నుంచి దీపిక బాలీవుడ్‌లో స్టార్ లీగ్‌లో చేరడానికి పెద్దగా సమయం పట్టలేదు. కిరిక్ పార్టీతో కన్నడలో ఎంట్రీ ఇచ్చిన రష్మికా మందన్నా కెరీర్ మాత్రం అందుకు భిన్నం. కన్నడ సినిమాల సక్సెస్ అనంతరం ఛలోతో టాలీవుడ్‌లో లాంచ్ అవ్వడం ఆ సినిమా సక్సస్ అవ్వడంతో టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదగడానికి పెద్దగా సమయం పట్టలేదు. అమ్మడి అందం, అభినయం, స్పార్క్ నచ్చడంతో అవకాశాలతో బిజీ అయింది. తెలుగులో స్టార్ హీరోలందరితో పనిచేసి పుష్పతో పాన్ ఇండియాలో ఫేమస్ అయింది. అటుపై యానిమల్‌తో బాలీవుడ్‌లో లాంచ్ అవ్వడం..అది హిట్ అవ్వడం...అక్కడా బిజీ అవ్వడం అన్నీ చాలా వేగంగా జరిగిపోయాయి. కానీ దీపిక, రష్మికలిద్దరు మళ్లీ కన్నెత్తి సొంత పరిశ్రమ వైపు చూడలేదు అన్నది అంతే వాస్తవం. హీరోయిన్లగా పాన్ ఇండియాలో ఎంతో గుర్తింపు వచ్చినా? కన్నడ సినిమాలు మాత్రం చేయలేదు. తెలుగులో సక్సెస్ అయిన అనంతరం రష్మికకు సొంత పరిశ్రమలో చాలా అవకాశాలు వచ్చాయి. కానీ వేటికి ఒకే చెప్పలేదు. చివరికి సొంత పరిశ్రమ నుంచి గౌరవ అతిధిగా ఆహ్వానాలు వచ్చినా? కూడా వాటిని సున్నితంగా తిరస్కరించింది. దీంతో సొంత పరిశ్రమలో అమ్మడిపై తీవ్ర వ్యతిరేకత ఉన్నది అన్నది వాస్తవం. దీపికా పదుకొణే మాత్రం నెగిటివిటీ తెచ్చుకోలేదు. ఈ విషయంలో అమ్మడు ఎంతో తెలివిగా వ్యవహరించింది. సొంత పరిశ్రమ గురించి ఏనాడు నెగిటివ్‌గా మాట్లాడలేదు. అక్కడ పెద్దలు ఆహ్వానించిన కొన్ని రకాల ఈవెంట్లకు హాజరైంది. ఆ రకంగా దీపిక మాత్రం సొంత పరిశ్రమ నుంచి ఎలాంటి విమర్శలు ఎదుర్కోకుండా సేఫ్ జోన్‌లోనే ఉంది.

# బన్నీ వేటలో దర్శకుల ఆట.. ఎంతమందంటే?



'పుష్ప 2' సృష్టించిన సునామీ ఇంకా ఎవరూ మర్చిపోలేదు. గత ఏడాది చివరలో వచ్చి బాక్సాఫీస్ దగ్గర ఏకంగా 1700 కోట్లు కొల్లగొట్టి, ఇండియన్ సినిమా సత్తాను ప్రపంచానికి చాటింది. ఆ కనీవినీ ఎరుగని విజయంతో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ రేంజ్ అమాంతం మారిపోయింది. ఇప్పుడు ఆయన వేసే ప్రతి అడుగుపై ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఆ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా బన్నీ తన తర్వాతి సినిమాలను ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం బన్నీ ఫోకస్ మొత్తం అట్లీ సినిమా మీదే ఉంది. ఇది కేవలం పాన్ ఇండియా సినిమా కాదు, ఒక 'పాన్ వరల్డ్' ప్రాజెక్ట్. దాదాపు 700 కోట్ల భారీ బడ్జెట్‌తో, హాలీవుడ్ కనెక్షన్‌తో ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. 'జవాన్'తో షారుఖ్‌కు బ్లాక్ బస్టర్ ఇచ్చిన అట్లీ, ఇప్పుడు బన్నీని గ్లోబల్ ఆడియన్స్‌కు పరిచయం చేయడానికి ఒక విజువల్ వండర్‌ను సిద్ధం చేస్తున్నాడు. ఇక ఫ్యూచర్ లైనప్ విషయానికి వస్తే, ఇప్పటికే రెండు క్రేజీ ప్రాజెక్టులపై అఫీషియల్ క్లారిటీ ఉంది. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, కల్ట్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగాతో సినిమాలు చేయబోతున్నట్లు ఇదివరకే అధికారిక ప్రకటనలు వచ్చాయి. అనౌన్స్ మెంట్ పోస్టర్స్ కూడా రిలీజ్ చేసి హైప్ పెంచారు. అట్లీ సినిమా తర్వాత వీటిలో ఏది ముందు పట్టాలెక్కుతుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ రెండు కాంబినేషన్లు బాక్సాఫీస్ దగ్గర మినిమమ్ గ్యారెంటీ అని ఫ్యాన్స్ ఫిక్స్ అయ్యారు. అయితే బన్నీ కోసం క్యూ కట్టిన వారిలో ఇంకా చాలామంది దిగ్గజాలు ఉన్నారు. సంజయ్ లీలా భన్సాలీ, ప్రశాంత్ నీల్, బేసిల్ జోసెఫ్, సురేందర్ రెడ్డి, బోయపాటి శ్రీను.. ఇలా చాలామంది బన్నీకి కథలు వినిపించారు. కానీ ఇవన్నీ కేవలం స్క్రిప్ట్ చర్చల దశలోనే ఉన్నాయి. 'పుష్ప 2' ఇచ్చిన బూస్ట్‌తో బన్నీ కథల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. పాన్ వరల్డ్ రేంజ్‌లో కంటెంట్ ఉంటే తప్ప గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం లేదు. ఈ లిస్టులో ఇప్పుడు కోలీవుడ్ సెన్సేషన్ లోకేష్ కనకరాజ్ పేరు సడెన్‌గా తెరపైకి వచ్చింది.

మొన్నటి వరకు సైలెంట్‌గా ఉన్న ఈ కాంబినేషన్‌పై ఇప్పుడు ఇండస్ట్రీలో జోరుగా చర్చ జరుగు తోంది. వీరిద్దరి మధ్య చర్చలు తుది దశకు వచ్చాయని, ఏ క్షణమైనా ఈ క్రేజీ ప్రాజెక్ట్ గురించి బిగ్ అప్డేట్ రావచ్చని గట్టిగా టాక్ వినిపిస్తోంది. లోకేష్ మార్క్ డార్క్ యాక్షన్, బన్నీ స్వాగ్ కలిస్తే థియేటర్లు దద్దరిల్లడం ఖాయం. అల్లు అర్జున్ ప్లానింగ్ చూస్తుంటే.. రాబోయే ఐదేళ్లు ఇండియన్ బాక్సాఫీస్ దగ్గర మరికొన్ని రికార్డులు బ్లాస్ట్ అయ్యేలా ఉన్నా యి. 1700 కోట్ల రికార్డును తన తర్వాతి సినిమాలతో తానే బద్దలు కొట్టుకునేలా పక్కా స్కెచ్ వేశారు. ప్రస్తుతం సెట్స్ పై ఉన్న అట్లీ సినిమా, లైన్లో ఉన్న సందీప్, త్రివిక్రమ్, లోకేష్ ప్రాజెక్టులు.. ఇవన్నీ చూస్తుంటే ఐకాన్ స్టార్ గ్లోబల్ ఐకాన్‌గా మారే రోజు ఎంతో దూరంలో లేదనిపిస్తోంది.

# లంకను తగలబెట్టే 'వానర' సేన




ఈ మధ్య చిన్న సినిమాలు పెద్ద కంటెంట్‌తో వచ్చి బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్నాయి. మైథాలజీ టచ్ ఉంటే ఆడియన్స్ ఇంకాస్త ఎక్కువగా కనెక్ట్ అవుతున్నారు. ఇప్పుడు అదే కోవలో 'వానర' అనే ఆసక్తికరమైన టైటిల్‌తో ఒక సినిమా రాబోతోంది. తాజాగా రిలీజైన ఈ మూవీ టీజర్ సోషల్ మీడియాలో మంచి బజ్ క్రియేట్ చేస్తోంది. ముఖ్యంగా టీజర్‌లో వినిపించిన వాయిస్, చూపించిన విజువల్స్ సినిమాపై క్యూరియాసిటీని పెంచేలా ఉన్నాయి. ఈ టీజర్ కు మెయిన్ హైలెట్ మాస్ కా దాస్ విశ్వక్ సేన్ వాయిస్ ఓవర్. "అసలు వానరులు అంటే ఎవరు? ఆకతాయిలు, తెలివైనవారు, మంచి కంత్రీగాళ్లు కూడా" అంటూ విశ్వక్ తనదైన మాస్ స్లాంగ్ లో చెప్పిన ఇంట్రో అదిరిపోయింది. కేవలం వాయిస్ ఇవ్వడమే కాకుండా, సినిమాలోని హీరో క్యారెక్టరైజేషన్ ను ఎలివేట్ చేసేలా విశ్వక్ చెప్పిన విధానం టీజర్‌కు పెద్ద ప్లస్ పాయింట్‌గా నిలిచింది. కథలో హనుమంతుడి రిఫరెన్స్‌ను చాలా తెలివిగా వాడారు. "వీళ్లకు నచ్చిన వాటిని ఎవరైనా ఎత్తుకెళ్తే మాత్రం.. ఆఖరికి అది ఎత్తుకెళ్లింది రావణాసురుడైనా సరే లంకని మొత్తం తగలబెట్టేస్తారు" అనే డైలాగ్ గూస్ బంప్స్ తెప్పిస్తోంది. మోడరన్ డేలో ఉండే యువకులకు, పురాణాల్లోని వానర సేన లక్షణాలకు లింక్ పెడుతూ కథను రాసుకున్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది. ఈ సినిమాతో అవినాష్ తిరువీధుల హీరోగా పరిచయం అవుతూనే, తానే స్వయంగా దర్శకత్వం వహించడం విశేషం. టీజర్‌లో అతని స్క్రీన్ ప్రెజెన్స్, యాక్షన్ ఎపిసోడ్స్ లో చూపించిన ఇంటెన్సిటీ ఆకట్టుకుంది. బైక్ రైడింగ్ షాట్స్, ఫైట్స్ చూస్తుంటే ఇదొక హై ఆక్టేన్ యాక్షన్ డ్రామా అనిపిస్తోంది.

హీరోయిన్‌గా సిమ్రాన్ చౌదరి కనిపిస్తుండగా, నందు విలన్‌గా ఒక వైవిధ్యమైన పాత్రలో నటిస్తున్నాడు. టెక్నికల్‌గా కూడా సినిమా స్ట్రాంగ్‌గా ఉన్నట్లు టీజర్ చెబుతోంది. వివేక్ సాగర్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సీన్లను బాగా ఎలివేట్ చేసింది. సాయి మాధవ్ బుర్రా రాసిన పదునైన మాటలు టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. సిల్వర్ స్క్రీన్ సినిమాస్ ఎల్ఎల్పి బ్యానర్‌పై నిర్మాతలు ఎక్కడా రాజీ పడకుండా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు విజువల్స్ చూస్తే తెలుస్తోంది. మొత్తానికి 'వానర' టీజర్‌తోనే సినిమాపై పాజిటివ్ వైబ్స్ క్రియేట్ చేశారు. మైథాలజీని మోడరన్ యూత్ లైఫ్ స్టైల్ కు కనెక్ట్ చేస్తూ చేసిన ఈ ప్రయోగం బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి ఫలితాన్ని ఇస్తుందో చూడాలి. సినిమా యూత్‌కు బాగా కనెక్ట్ అయ్యేలా ఉంది. త్వరలోనే ఈ సినిమా థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధమవుతోంది.

# జిల్లా అభివృద్ధికి కృషి చేయండి

**- ఉపాధి హామీ నిధులను పూర్తిగా వినియోగించుకోవాలి - సహజ ప్రసవాలు జరిగే విధంగా చూడండి - రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ జోగేశ్వర్రావు వివిధ శాఖల అధికారులతో సమీక్ష - సేంద్రీయ పంటల ప్రతిపాదనపై డిఆర్‌డిఏకి అభినందనలు**







**విజయనగరం, (రాజధాని వార్తలు):** అధికారులంతా జిల్లా అభివృద్ధికి తమవంతు కృషి చేయాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మెన్ వి.జోగేశ్వర్రావు కోరారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం జిల్లా ఎంతో అభివృద్ధి చెందిందని, దీనిని మరింత ముందుకు తీసుకువెళ్లి, రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలబెట్టాలని ఆకాంక్షించారు. అందుకు తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. చైర్మన్ జోగేశ్వర్రావుతో పాటు కమిటీ సభ్యులు నిమ్మక జయకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, డాక్టర్ పివివి సూర్యనారాయణరాజు, వరుదు కల్యాణి గురువారం జిల్లాలో పర్యటించారు. కలెక్టరేట్లో వివిధ శాఖలకు మంజూరైన నిధులు, వినియోగం, అవసరాలపై సమీక్షించారు. వ్యవసాయం, ఉద్యానశాఖ, పశు సంవర్ధకశాఖ, మైక్రో ఇరిగేషన్, నీటిపారుదల, వైద్యారోగ్యం, విద్య, త్రాగునీరు, పంచాయితీరాజ్, జిల్లా పరిషత్, పబ్లిక్ హెల్త్, ఆర్ అండ్ బి, డిఆర్‌డిఏ, స్త్రీ శిశు సంక్షేమం తదితర శాఖలపై చర్చించారు. మహిళా పొదుపు సంఘాల అధ్వర్యంలో సేంద్రీయ వ్యవసాయం ద్వారా కూరగాయలు పండించి మధ్యాహ్న భోజన పథకానికి, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయడానికి డిఆర్‌డిఏ చేసిన ప్రణాళికను అభినందించారు. ఈ ప్రణాళికను రాష్ట్రమంతా అమలు చేయడానికి కృషి చేస్తామని చైర్మన్ ప్రకటించారు. జిల్లాలో మహిళా అక్షరాస్యత తక్కువగా ఉందని, దీనిని పెంచేందుకు కృషి చేయాలని కోరారు. వరి ఉత్పాధకత పెంచాలని సబ్సిడీపై రెయిన్ గన్‌లను అందజేసేందుకు ప్రతిపాదన చేయాలని సూచించారు. సహజ ప్రసవాలను ప్రోత్సహించాలని, సిజేరియన్లను తగ్గించాలని చెప్పారు. గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో పాఠశాలల ప్రహరీ గోడలు, లింకు రోడ్లు, సిమ్మెంటు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని చైర్మన్ కోరారు. నిధులను పూర్తిగా వినియోగించుకోవాలని, మురిగిపోకుండా చూడాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, విలేజ్ హెల్త్ సెంటర్ భవనాలను పూర్తిచేయడంపై దృష్టి పెట్టాలన్నారు. చాలాచోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు శిథిలావస్థలోను, అద్దె భవనాల్లోను ఉన్నాయని, సమీపంలో ఖాళీగా ప్రభుత్వ భవనాల్లోకి తరలించాలని సూచించారు. కమిటీ సభ్యులు, ఎంఎల్ఏ నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ చాలా చోట్ల పశువైద్యశాలలు శిధిలావస్థకు చేరాయని చెప్పారు. ఉపాధి హామీ ద్వారా పాఠశాలల ప్రహరీ గోడలు నిర్మించాలని సూచించారు. ఎంఎల్ఏ మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ విద్యాప్రమాణాలను పెంచేందుకు మంత్రి నారా లోకేష్ విద్యారంగంలో ఎన్నో సంస్కరణలను అమలు చేస్తున్నారని చెప్పారు. తల్లికి వందనం పథకం ద్వారా పాఠశాలల్లో చేరికలు పెరిగాయని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యత పెరిగిందని, పోషకాహార పదార్ధాలు అందుతున్నాయని అన్నారు. ఎంఎల్‌సి డాక్టర్ పివివి సూర్యనారాయణరాజు మాట్లాడుతూ తారకరామ తీర్ధసాగర్ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఆరోగ్య పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. ఎంఎల్‌సి వరుదు కల్యాణి మాట్లాడుతూ వర్షాల వల్ల వరిపంట కొంతమేర దెబ్బతిన్నదని, నూకలు ఎక్కువగా వస్తుండటం వల్ల, ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు రైతు నష్టపోకుండా చూడాలని కోరారు. కమిటీ డిప్యుటీ కార్యదర్శి రాజ్‌కుమార్ మాట్లాడుతూ, జిల్లాలో మహిళా అధికారిణులు ఎక్కువగా ఉన్నప్పటికీ సమర్ధవంతంగా పరిచేస్తున్నారని చెప్పారు. అలాగే సేంద్రీయ వ్యవసాయం విషయంలో డిఆర్‌డిఏ పిడిని ప్రత్యేకంగా అభినందించారు. ఆయా శాఖలకు సంబంధించిన అంశాలను జాయింట్ కలెక్టర్ ఎస్.సేధుమాధవన్ చైర్మన్‌కు వివరించారు. జిల్లాలో ఆయిల్ పాం వృద్ధికి ప్రత్యేక ప్రణాళికను రూపొందించినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలు సమయంలో రైతులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో డిఆర్ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, సిపిఓ పి.బాలాజీ, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు.

# 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' కార్యక్రమానికి పూర్తి మద్దతు ఇస్తున్నాం : శ్రీకాళహస్తి కమిషనర్ భవాని ప్రసాద్

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ మరియు ప్రగతి సంస్థ కలిసి బాల్య వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని శ్రీకాళహస్తి మున్సిపల్ ఆఫీసులో ఘనంగా నిర్వహించారు. శ్రీకాళహస్తి, తొట్టంబేడు, కె.వి.బి.పురం మండలాల్లో 50 గ్రామాలలో గ్రామస్థులు, కుల పెద్దలు, మత పెద్దలు, ప్రభుత్వ అధికారులు, టీచర్లు, పిల్లలు మొదలగున వారు సుమారు 5000 మంది చేతులు జోడించి, తిరుపతి జిల్లా 'బాల్ వివాహ్ ముక్త్ భారత్'కు స్వాగతం పలికేందుకు ర్యాలీలు మరియు బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ శాంతి దుర్గ మాట్లాడుతూ "ఈ 100 రోజుల కార్యాచరణ దేశ భవిష్యత్తును మార్చే శక్తి కలిగి ఉంది. ప్రభుత్వం, చట్ట అమలు సంస్థలు, ప్రజా ప్రతినిధులు, సమాజయిఅల్ తొగెథెర్ ఒక శక్తివంతమైన కూటమిలా పనిచేస్తున్నారు. ఈ సమిష్టి సంకల్పంతో తిరుపతి జిల్లా ఒక సంవత్సరంలోనే బాల్య వివాహ రహిత జిల్లాగా మారుతుందని మాకు పూర్తి నమ్మకం ఉంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంకు ఉద్దేశించి ముఖ్య అతిధిగా విచ్చేసిన శ్రీకాళహస్తి పట్టణ కమిషనర్ భవాని ప్రసాద్ మాట్లా








డుతూ చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ ఇండియా చైల్డ్ వందరోజుల క్యాంపైని ఉద్దేశించి బాల్య వివాహాల వలన ఆడపిల్లలకు జరిగేటువంటి నష్టాలను గురించి వివరిస్తూ, రాజా రామ్మోహన్ రాయ్ మరియు కందుకూరి వీరేశలింగం గారు మొదలైన సంఘసంస్కర్తలు బాల్య వివాహాల గురించి చేసిన పోరాటాలను గుర్తు చేశారు. బాల్య వివాహాలను నివారించడానికి కృషి చేస్తున్నటువంటి ప్రతి ఒక్కరికి ఆయన అభినంది, బాల్య వివాహాలను ఆపడానికి కావలసినటువంటి ఎటువంటి సహకారమైనా వారు అందించడానికి సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రగతి సంస్థ జిల్లా సమన్వయకర్త ఎం.రాజారెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బాల్య వివాహ నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 100 రోజుల ధృడ కార్యాచరణ ప్రణాళికకు తోడుగా, ప్రగతి సంస్థ బాల్య వివాహ నివారించడానికి పనిచేస్తుంది. 'బాల్య వివాహ ముక్త భారత్' కార్యక్రమం అమలు ప్రారంభమై ఏడాది పూర్తి అయిన సందర్భంలో, ప్రగతి సంస్థ జిల్లాలోని పాఠశాలలు, విద్యాసంస్థలు, గ్రామాలు మరియు కమ్యూనిటీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. అలాగే, బాల్య వివాహ నిషేధ చట్టం (పిసిఎంఏ) పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, బాల్య వివాహంలో పాలుపంచుకునే కేటరర్లు, టెంట్ హౌసులు, ధర్మగురువులు వంటి వారందరికీ శిక్షలు ఉండనున్నాయని వివరించారు. అనంతరం బాల్య వివాహాలకు సంబంధించి పోస్టర్ని ఆవిష్కరించి, కొవ్వొత్తులతో ప్రదర్శన తో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలయ్య, భారతి, డిప్యూటీ తహసీల్దార్ అనిల్, చంద మామల కోటయ్య, ఇచ్ఛ్ సూపెర్వైసోర్స్, సూపర్ డిడి మొదలగున వారు బాల్య వివాహాల గురించి వివరిస్తూ వారి యొక్క అనుభవాలను అందరితో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఐసిడిఎస్ శాంతి దుర్గ, ప్రగతి తిరుపతి జిల్లా కోఆర్డినేటర్ రాజా రెడ్డి, కమ్యూనిటీ సోషల్ వర్కర్స్ మోహన్ బాబు, లత, అంగన్వాడి సూపర్వైజర్స్, అంగన్వాడి వర్కర్స్, మహిళా పోలీసులు, సెక్రటరీలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞానాపురంలో తప్పిపోయిన వృద్ధుడికి అవర్ హ్యాండ్స్ సహాయం




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** జ్ఞానాపురం కొండ వీధుల్లో మతిస్థిమితం లేని ఒక వృద్ధుడు సంచరిస్తున్నాడనే సమాచారం సెల్ పాయింట్ జయరాజు, జోష్న అందించిన నేపథ్యంలో అవర్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి పిల్లి గోవిందరాజు మానవతా దృక్పథంతో స్పందించారు. ఆ వృద్ధుడికి దుస్తులు వేసి, తగిన సహాయం అందించారు. తదుపరి, విషయాన్ని కంచరపాలెం పోలీస్ స్టేషన్ ఎస్ఐ. విజయ్‌కుమార్ మరియు మొబైల్ కానిస్టేబుల్ రాంబాబుకి తెలియజేశారు. పోలీసులు దర్యాప్తు జరిపి ఆ వృద్ధుడి కుటుంబ సభ్యులను కనుగొని, వారికి సమాచారం అందించి ఆ వృద్ధుడిని వారికి అప్పగించారు. వారి కుటుంబంలో వెలుగులు నింపిన ఈ మానవతా సేవ పట్ల ఈ గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. సమస్యపై తక్షణమే స్పందిం చినందుకు అవర్ హ్యాండ్స్ అసోసియేషన్ తరపున పిల్లి గోవిం దరాజు మరియు ప్రజలు పోలీసు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

# వీధి కుక్కల నియంత్రణ సిబ్బందికి యాంటీ రాబిస్ వ్యాక్సిన్

**- సిటీ వెటర్నరీ అధికారి డాక్టర్ ఎల్.రవికుమార్**

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు వీధి కుక్కల నియంత్రణ సిబ్బందికి రాబిస్ వ్యాధి రాకుండా ముందస్తుగా యాంటీ రాబిస్ వ్యాక్సిన్ జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం వేయడం జరిగిందని జీవీఎంసీ సిటీ వెటర్నరీ అధికారి డాక్టర్ ఎల్.రవికుమార్ గురువారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా సిటీ వెటర్నరీ అధికారి మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలోగల 50 మంది వీధి కుక్కలను పట్టుకునే సిబ్బందికి, శస్త్ర చికిత్సలు నిర్వహించే వారికి రాబిస్ వ్యాధి రాకుండా ముందస్తుగా యాంటీ రాబిస్ వ్యాక్సిన్ టీకాను జంతు సంరక్షణ సేవా సంఘం సభ్యులతో కలిసి వేయించడం జరిగిందని తెలిపారు. జీవీఎంసీ వెటర్నరీ సిబ్బంది వీధి కుక్కలను పట్టుకునేటప్పుడు, శస్త్ర చికిత్సలు నిర్వహించినప్పుడు మానవతా దృక్పథంతో ప్రవర్తించి పట్టుకోవాలని సిబ్బందికి ఆదేశించడమైనదని తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు వీధి కుక్కలకు ఆహారం పెట్టే సమయంలో ఆయా ప్రాంతాలలోని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు పాటించాలని జంతు సంరక్షణ సేవా సంఘ ప్రతినిధులకు, సభ్యులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ వైద్యాధికారి డాక్టర్ ఎన్.కిరణ్ కుమార్, జంతు సంరక్షణ సేవా సంఘం సభ్యులైన శారద, ప్రమోద్, కుసుమ, శ్రీదేవి, రవి తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక భవనాన్ని ప్రారంభించిన నగర మేయర్





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ప్రజలకు మౌలిక వసతుల కల్పనే ప్రథమ కర్తవ్యమని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం ఆయన 4వ జోన్ 37వ వార్డు పరిధిలోని జబ్బరు తోట వద్ద సుమారు 42 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మించిన సామాజిక భవనం రెండవ అంతస్తును దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్ చెన్న జానకిరామ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ నగర ప్రజలకు మౌలిక వసతులు కల్పన ప్రథమ కర్తవ్యం అని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు మౌలిక వసతుల పాటు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ప్రజలకు చేరువలో ఉంటుందన్నారు. ప్రజలకు మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు అందించడంలో పార్టీలకతీతంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. జబ్బరు తోటలోని ప్రజల అవసరాల మేరకు సామాజిక భవనానికి అదనపు అంతస్తు నిర్మించి నేడు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అనంతరం దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విశాఖ అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. దక్షిణ నియోజకవర్గం పరిధిలోని అన్ని వార్డులలో అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, జబ్బరు తోటలో సామాజిక భవనాన్ని ప్రారంభించి ఇక్కడ ప్రజలకు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎమ్ మల్లయ్య నాయుడు, జీవీఎంసీ ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ వెంకటేశ్వరరావు, సహాయక ఇంజనీరు, సచివాలయం కార్యదర్శులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్ వైసీపీదే : వైసీపీ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** భవిష్యత్ వైసిపిదేనని దక్షిణ నియోజక వర్గం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి పార్టీకి మరింత బలం పెరిగిందన్నారు. ఇప్పటికి ప్పుడు పోటీ జరిగిన రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి పార్టీ సంచలనం సృష్టిస్తుందని వెల్లడించారు. 27వ వార్డు అధ్యక్షుడు సర్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో అనుబంధ సంఘాల నాయకులను వార్డు, బూత్ కమిటీలో చేర్చినందుకు వాసుపల్లి గణేష్ కుమార్‌కి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని ఆరోపించారు. ఇచ్చిన హామీలను పక్కనపెట్టి తమ సొంత ఎజెండాతో ముందుకు వెళుతుందని విమర్శించారు. ఈ ప్రభుత్వం ప్రజలకు చేసింది. ఏమీ లేదని ఎద్దేవా చేశారు. వైసీపీతోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. వచ్చే




ఎన్నికలలో వైసిపి రాష్ట్రవ్యాప్తంగా మెజార్టీ సీట్లు గెలుచుకొని సంచలనం సృష్టించిందని చేశారు. పార్టీ ప్రతిష్టకు పని చేస్తున్న ప్రతి కార్యకర్తకు కూడా గుర్తింపు ఉం టుందని తెలియజేశారు.

# తాగునీటి సరఫరాకు పైప్ లైన్ ఏర్పాటు చేయాలి



**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** నాయుడుపేట మున్సిపాలిటీ పరిదిలోని 3,4 వార్డుల్లో తాగునీటి సరఫరా చేయడం కోసం ప్రత్యేక పైపు లైన్ ఏర్పాటు చేయాలని కోరుతూ 3వ వార్డు కౌన్సిలర్ రాయపు సరిత మున్సిపల్ కమీషనర్ షేక్.ఫజులుల్లాకు వినతిపత్రం అందజేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ ప్రాంతం మీదుగా టిడ్‌కో సముదాయానికి తాగునీటికి సరఫరా చేస్తున్న పైప్ లైన్‌కు 3, 4 వార్డుల్లో తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రత్యేక కనెక్షన్ ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధు రెడ్డి, డి ప్రసాద్, అనిల్ రెడ్డి, శేఖర్, రాజేష్ కుమార్, నాగేంద్రబాబు, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

# బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా చేవూరు వినయ్ నారాయణ



**బుచ్చిరెడ్డిపాలెం, (రాజధాని వార్తలు):** బుచ్చిరెడ్డిపాలెం నివాసి బిజెపి ఎంపీటీసీ సభ్యులు, ప్రస్తుత కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చేవూరు వినయ్ నారాయణ ను భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా వినయ్ నారాయణను నియమిస్తూ, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వినయ్ నారాయణ నియామకంపై బుచ్చిరెడ్డిపాలెంలో పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాల్యంలోనే ఆర్ఎస్ఎస్‌లో చేరి ముఖ్య శిక్షక్‌గా పనిచేసి, విద్యార్థి దశలోనే ఏబీవీపీ నాయకుడుగా పలు విద్యార్థి ఉద్యమాలలో విద్యార్థుల సమస్యల కోసం పోరాడి 1998 సంవత్సరంలోనే బీజేవైఎం బుచ్చిరెడ్డిపాలెం మండల అద్యక్షునిగా, అనంతరం బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా జిల్లా ఉపాధ్యక్షుడుగా రాష్ట్ర కార్యదర్శి వరకు అనేక బాధ్యతలలో తనదైన శైలిలో అనేక సమస్యలపై పోరాడిన అనంతరం కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా, జిల్లా అద్యక్షుడిగా రైతుల కోసం అలుపెరగని పోరాటం చేశారనీ తను పెనుబల్లి ఎంపీటీసీగా గెలిచి బీజేపీ సామన్యుల పార్టీ అని ఋజువు చేశారనీ సామాన్య కార్యకర్తగా మొదలైన తన ప్రస్థానం, నిస్వార్థంతో, నిబద్ధతతో, తన కర్తవ్యాన్ని ఎప్పటికప్పుడు గుర్తు చేసుకుంటూ తన మార్క్ చూపిస్తూ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి ప్రజల పక్షాన పోరాడుతానని హామీ ఇచ్చి ఈ పోటీ ప్రపంచంలో ప్రజల చేత ఎన్నిక కాబడి ప్రజాస్వామ్యంలో ఎంపీటీసీగా గెలిచి ఈరోజు సగర్వంగా రైతులు ప్రజల పక్షాన నిలబడి నెల్లూరు జిల్లాకే వన్నె తెచ్చేవిధంగా తన వాణిని వినిపిస్తున్న చేవూరు. వినయ్ నారాయణను ఈరోజు పార్టీ పెద్దలు గుర్తించి ఈ భాద్యతను అప్పగించడం, తను పడ్డ కష్టానికి బహుమతి అని తెలియజేస్తూ రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శిగా నియమితులైన వినయ్ నారాయణను పలువురు నాయకులు సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, ఓబీసీ మోర్చా ఆర్.టి.ఐ సెల్ జిల్లా కన్వీనర్ కీలుకుప్ప శ్రీనివాస్ యాదవ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి గెండి పెంచలక్రిష్ణ, బీజేపీ నాయకులు దాసరి అనీల్, గాదంశెట్టి సురేష్, తాల్లపరెడ్డి శివకుమార్ రెడ్డి, గెండి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం జన్మదిన వేడుక





**దొరవారిసత్రము, (రాజధాని వార్తలు):** దొరవారి సత్రం మాజీ తిరుపతి ఎంపీ, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే, మాజీ టీటీడీ బోర్డు మెంబర్, నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్, నేటి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తండ్రి నెలవల సుబ్రహ్మణ్యం జన్మదిన వేడుకను దొరవారి సత్రం మండల కేంద్రంలో ఘనంగా ఏర్పాటు చేశారు. మండల తెలుగుదేశం పార్టీ నాయకులు జన్మదిన ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ఈ కార్యక్రమ నిర్వహణ అతిథిగా ఆ కుటుంబం అల్లుడు పార్థసారథి పాల్గొని జన్మదిన వేడుక పూర్తిగా కేక్ కోసి శుభాకాంక్షలు ప్రకటించారు.
అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. జన్మదిన జరుపుకున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం నిండు నూరేళ్లు, ఆయురారోగ్యాలతో ఆనందమైన జీవితం గడపాలని పార్టీ నాయకులంతా ఆకాంక్షించారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ రథసారథి, పార్టీకి పెద్ద దిక్కుగా, నాయకులకు దిక్సూచిగా నడిపిస్తున్న ఆయన మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని వారి అభిప్రాయాలను వెల్లడించారు.

# భూపతి మరణం అత్యంత బాధాకరం : మిన్నల్ రవి



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలో అత్యంత కీలకమైన నాయకుడిగా గుర్తింపు పొంది ప్రమాదవశాత్తు మరణించిన భూపతి భౌతికకాయానికి కుప్పంలోని వారి స్వగృహంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి రామకుప్పం మండలంలోని వారి స్వగృహంలో భూపతి మృత దేహానికి నివాళులు అర్పించారు. తమకు తీవ్రమైన భావోద్వేగానికి గురిచేసిందని, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ సంక్షేమ మరియు అభివృ ద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ వి.భూపతిని కోల్పోవడం అటు తెలుగు దేశం పార్టీకి, ఇటు వన్నెకుల క్షత్రియ సమాజానికి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. అనతికాలంలోనే సమర్ధవంతమైన నాయకుడిగా గుర్తింపు తెచ్చుకొని, ఇలా అర్ధాంతరంగా తమను వదిలి పెట్టి వెళ్లడాన్ని జీర్ణించుకోలేక పోతున్నామని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం మున్సిపాలిటీ చైర్మన్ సెల్వ రాజు, వన్నెకుల క్షత్రియ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, కె.ఎం.వేణుగోపాల్, సెల్వం, రామకుప్పం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వెంకటరమణ, రామకుప్పం మండలం వన్నెకుల క్షత్రియ సంక్షేమ సంఘం అధ్యక్షులు జయన్న, కుప్పం మున్సి పాలిటీ వన్నెకుల క్షత్రియ అధ్యక్షులు నాగేంద్ర, కుప్పం సింగల్ విండో అధ్యక్షులు కృష్ణమూర్తి,కుప్పం తిరుపతి గంగమ్మ దేవస్థానం డైరెక్టర్ శరవణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు నారాయణలో స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం

## - నారాయణ విద్యాసంస్థల జిఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాములు నిర్వహిస్తున్నామని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌కు చెందిన విద్యార్థులకు నిర్వహించిన స్కిల్ డెవలప్మెంట్ కాంటెస్ట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు వివిధ రంగాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. దిశా పేరుతో నారాయణ సాఫ్ట్ స్కిల్స్ డిపార్ట్మెంట్ వారి ఆధ్వర్యంలో మాస్టర్ ఒరేటర్ కాంటెస్ట్ సీజన్ సిక్స్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులలో అకాడమిక్స్‌తో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, పబ్లిక్ స్పీకింగ్ స్కిల్స్, లీడర్షిప్ స్కిల్స్‌ను పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. మాస్టర్ ఒరేటర్ కాంటెస్ట్ సీజన్ 6 అనే ప్రోగ్రామ్‌ను 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు ఉన్న విద్యార్థుల కోసం నిర్వహించడం జరిగిందన్నారు. నారాయణలో విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు, వారి నైపుణ్యాలను మెరుగుపరచేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయని, వాటిలో మాస్టర్ ఒరేటర్ కాంటెస్ట్ డిపార్ట్మెంట్ ఆఫ్ సాఫ్ట్ స్కిల్స్ నిర్వహించే అత్యంత ప్రభావవంతమైన కార్యక్రమాలలో ఒకటనీ వివరించారు. ఏటీఎం రవి వర్మ మాట్లాడుతూ ఈ పోటీలో నెల్లూరు జోన్‌కు చెందిన 20 బ్రాంచ్‌ల విద్యార్థులు పాల్గొనడం జరిగిందన్నారు. నేడు వివిధ దశలలో నిర్వహించిన పోటీలలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులు తదుపరి రౌండ్లకు ఎంపికయ్యారనీ తెలిపారు. రెండు రోజులపాటు జరిగే గ్రాండ్ ఫైనల్‌లో మొత్తం 230 మంది విద్యార్థులు పోటీలో పాల్గొంటారని, నేడు 110 మంది విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారని రేపు మరో 120 మంది విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభను కనబరుస్తారని పేర్కొన్నారు. మొదట ఈ పోటీ బ్రాంచ్ స్థాయిలో నిర్వహించబడుతుందనీ, ఆ తర్వాత ఎంపికైన విద్యార్థులు జోనల్ ఫైనల్ రౌండ్కు ఎంపిక కాబడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని బ్రాంచ్ల ఏజీఎంలు, ఆర్ అండ్ డి కోఆర్డినేటర్లు క్లస్టర్ ప్రిన్సిపాల్‌లు ప్రిన్సిపాల్ సాఫ్ట్ స్కిల్స్ విభాగాధిపతులు విద్యార్థులు తల్లిదండ్రులు హాజరయ్యారు.

# మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంకు జన్మదిన శుభాకాంక్షలు : ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్



**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం జన్మదిన వేడుకలు గురువారం నాయుడుపేట పట్టణంలోని ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ సం దర్భంగా ఏఎంసీ చైర్మన్, జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జి ఉయ్యాల ప్రవీణ్,సీనియర్ జనసేన పార్టీ నాయకులు అట్ల కృష్ణారావులు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంకు శాలువాలు కప్పి పూలమాలలు వేసి, సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఆనందంగా ఉంటూ ప్రజాసేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాలలో వ్యాసరచన పోటీలు






**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశముల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ,జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ విభాగం సహకారంతో నవజీవన్ ఆర్గనైజేషన్ -సి.సి- పి.యు- ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో "ఐ.ఇ.సి స్టాల్" ద్వారా హెచ్.ఐ.వి/ఎయిడ్స్ పై అవగాహనను నాయుడుపేటలోని "ప్రభుత్వ హాస్పిటల్" నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమమును ప్రభుత్వ హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ అమర్నాథ్ చేతులు మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగముగా ప్రాజెక్ట్ మేనేజర్ కె. బాలాజి మాట్లాడుతూ, హెచ్.ఐ.వి ఎయిడ్స్ వ్యాప్తి కారకాలు, ఎలా వ్యాపించదు, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ లక్షణాలు, అవి రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్, క్షయ వ్యాధి సంబంధం గూర్చి, సుఖ వ్యాధులు మరియు చికిత్స గూర్చి, డ్రగ్స్ వాడకం వలన కలిగే ఇబ్బందులు, కండోమ్ యొక్క ఉపయోగము గూర్చి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ ఏక్ట్ 2017, ఎ.ఆర్.టి మందులు, ఏ.పి.శాక్స్ యాప్, టోల్ ఫ్రీ నెంబర్ 1097 గూర్చి తెలుపుతూ, మీ ద్వారా తెలియని వాళ్లకు తెలియజేయమని చెప్పడం జరిగింది. తదుపరి మెడికల్ ఆఫీసర్ పి.యన్ అమర్నాథ్ మాట్లాడుతూ నవజీవన్ ఆర్గనైజేషన్ వారు చేస్తున్న సేవలు అభినందనీయం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిపార్ట్మెంట్ కానిస్టేబుల్ కె. భాస్కర్ రాజు, నవజీవన్ సి.సి పి.యు ప్రాజెక్టు సిబ్బంది కె.బాలాజి,కవిత, శ్రావణి, సాయి లక్ష్మి, శ్రీలత, ఇతర హాస్పిటల్ సిబ్బంది మరియు ఇతర ప్రజలు పాల్గొన్నారు. తదుపరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు మరియు యస్.పి.జి.సి జూనియర్ కళాశాల నందు హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన కలిగించి వారికి క్విజ్ మరియు వ్రాతపరీక్షలు నిర్వహించి వారు ఎంతవరకు అవగాహన పొందారో తెలుసుకోవడం జరిగింది. వారికి ప్రధమ, ద్వితీయ, తృతీయ బహుమతులు త్వరలో అందిస్తామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్‌లు, ఇతర అధ్యాపకులు, 83 విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# ఎంపీ సమక్షంలో మహిళలు జనసేనలో చేరిక



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ సమక్షంలో పెద్దాపురం పట్టణం 7వ వార్డుకు చెందిన బ్రాహ్మణ సంఘం మహిళలు జనసేన పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మహిళలకు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ పార్టీ కండువా వేసి సాధారంగా పార్టీలో ఆహ్వానించారు. కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగేళ్ళ ఉదయ్ శ్రీనివాస్ క్యాంపు కార్యాలయంలో కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) ఆధ్వ ర్యంలో జనసేన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలకు ఆకర్షితులై కూటమి చేస్తున్న అభివృద్ధి సంక్షేమం చూసి జనసేన పార్టీలో చేరడం జరిగిందని మహిళలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం పట్టణ జనసేన పార్టీ అధ్యక్షులు పోలమరశెట్టి సత్తిబాబు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యన్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పోట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM 9440662699


# కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో రాష్ట్ర దేశ రాజకీయాల్లో నెల్లూరు జిల్లా కీలక పాత్ర

## - జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చేవూరు దేవకుమార్ రెడ్డి







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఏఐసీసీ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ సంస్థగత నిర్మాణంలో భాగంగా గురువారం ఉదయం నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చేవూరు. దేవకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కేంద్ర కార్యాలయం స్థానిక ఇందిరాభవన్లో సంఘటన్ సృజనా అభయాన్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ఏఐసీసీ పరిశీలకుడు, తమిళనాడు వేళాచ్చేరి శాసనసభ సభ్యులు హాసన్ మౌలానా విశిష్ట అతిథిగా ఏపీసీసీ స్పోర్ట్స్ సెల్ చైర్మన్, పరిశీలకుడు జీవివి.ఎస్.కమలాకర్ రావు ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి, సమన్వయకర్త పంటా.శ్రీనివాసులు రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, సమన్వయకర్త యం.బుల్లిబాబు ముఖ్య అతిథులుగా పాల్గొని, నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలో పార్టీ నేతల నుంచి సలహాలు సూచనలు తీసుకొన్న అనంతరం ప్రణాళికాబద్ధంగా ప్రజల్లోకి ఎలా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలో దిశానిర్దేశం చేశారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన ఈ సమావేశానికి



రాష్ట్ర పార్టీ నాయకులు, నియోజకవర్గ సమన్వయకర్తలు, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు, మండల, పట్టణ, డివిజన్, వార్డు కమిటీ అధ్యక్షులు, వివిధ మండలాలకు జిల్లా పార్టీ నుంచి పరిశీలికలుగా నియమింపబడిన నాయకులు, ముఖ్య నాయకులందరూ ఈ సమావేశంలో పాల్గొని విజయవంతం చేశారు.

# మేయర్‌గా పొట్లూరు స్రవంతి జయవర్ధన్‌నే..

## - ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ తీర్మానం



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మేయర్‌గా పొట్లూరు స్రవంతి జయవర్ధన్‌నే మేయర్గా కొనసాగాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ తీర్మానం చేసినట్లు యానాది గిరిజన సంఘాల రాష్ట్ర అధ్యక్షులు బిఎల్ శేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత కొంతకాలంగా నెల్లూరు జిల్లా నగర మేయర్ అయినటువంటి పొట్లూరు స్రవంతి జయవర్ధన్‌ని మేయర్ పదవి నుంచి తొలగించాలని అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఇది సరైన పద్ధతి కాదని, గత కొన్ని రోజులుగా ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ తరపున పలు గిరిజన సంఘాల నాయకులు మొన్న నెల్లూరు జిల్లా, నిన్న తిరుపతి జిల్లా, ఈరోజు ప్రకాశం జిల్లాలోని అవిశ్వాస తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని పొట్లూరు స్రవంతి జవర్ధన్ నే మేయర్గా కొనసాగించాలని సంఘీభావంతో ప్రెస్ మీట్ లు పెట్టడం జరుగుతుంది. ఈ సందర్భంగా గిరిజన సంఘాల నాయకులు మాట్లాడుతూ ఇది చాలా అన్యాయం అని ఇక చివరిగా ఒక సంవత్సరం కాలంలో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టి స్రవంతిని గద్దె దించే ప్రయత్నం చాలా దుర్మార్గమని గిరిజనలంటే అంత చిన్న చూపాలని ఇకనైనా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మరియు ఐటీ శాఖ మంత్రులు నారా లోకేష్ చొరవ చేసుకొని ఈ అన్యాయాన్ని అరికట్టి స్రవంతినే మేయర్‌గా కొనసాగించాలని రాష్ట్ర గిరిజన సంఘాల ఐక్యవేదిక కమిటీ విన్నవించింది. అలానే ఇంత జరుగుతున్నా ఆమెకు సపోర్ట్ చేసిన వారిపై దాడులు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఫోన్లో బెదిరింపులు వస్తున్నాయని ఇది ఎంతవరకు స్థానిక శాసనసభ్యులు చేసేటువంటి వక్ర చర్యని అలానే నగర డిప్యూటీ మేయర్ రోప్ కుమార్ మేయర్‌కి సంఘీభావం తెలుపుతున్న గిరిజన సంఘాల నాయకుల పేర్లను లోకేష్ తయారుచేసిన రెడ్ బుక్కు లాగా రూపుగారు వైట్ బుక్‌లో రాస్తున్నారని ఇది ఎంతవరకు సమంజసమని నాయకులు ఖండించారు. ఇది ఇలానే కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా పోరాటం చేయక తప్పదు అన్నారు. ఇప్పుడే అందిన వార్త మా దళిత సోదరులైన ఎమ్మార్పీఎస్ నాయకులు ముస్లిం నాయకులు మరియు దళిత సంఘాల నాయకులు ఈ కార్యక్రమానికి తమ వంతు మద్దతు తెలుపుతున్నామని రేపటి నుంచి పోరాటంలో మేము కూడా పాలు పంచుకుంటామని తెలిపారు. వారికి మా తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. ఈ కార్యక్రమంలో యానాది సంఘాల మహాకూటమి రాష్ట్ర అధ్యక్షులు బాపట్ల వెంకటపతి, గిరిజనుల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బి ఎల్ శేఖర్, యానాది సంఘాల మహాకూటమి నెల్లూరు జిల్లా అధ్యక్షులు ఏ కోళ్ల సుధీర్ జిల్లా ఉపాధ్యక్షులు రవి ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇండ్ల శ్రీనివాసులు మరియు ఉపాధ్యక్షులు చేవూరు వెంకటేశ్వర్లు మొదలగు వారు పాల్గొన్నారు.

# ఆగ్నేయ వినాయక స్వామి కుంభాభిషేకంలో పాల్గొన్న చైర్మన్ కొట్టేసాయి ప్రసాద్



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానం చతుర్మాడ వీధుల నందలి ఆగ్నేయ మూలలో ఉన్న ఆగ్నేయ గణపతి స్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్ట, దేవాలయ మహాకుంభాభిషేక కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థాన చైర్మన్ కొట్టేసాయి సతీసమేతంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహకాధికారి బాపిరెడ్డి, పాలక మండలి సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి, ఆలయ సిబ్బంది,స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

# వరసిద్ధి వినాయక స్వామి ఆలయ కాంపౌండ్ వాల్ శంకుస్థాపన

**సంగం, (రాజధాని వార్తలు):** అన్నారెడ్డిపాళెం - పల్లెపాలెం గ్రామంలో వరసిద్ధి వినాయక స్వామి ఆలయ కంపౌండ్ వాల్ శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆలయ కంపౌండ్ వాల్ నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేశారు గ్రామ అభివృద్ధి దిశగా ముందడుగుగా సాగిన ఈ కార్యక్రమం అత్యంత విజయవంతంగా జరిగింది.

ఈ శంకుస్థాపన కార్యక్రమానికి సంగం టీడీపీ మండల అధ్యక్షులు బాణ శ్రీనివాసులు రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన చేశారు. ఆలయ పరిసరాలకు భద్రత, శోభను పెంచే లక్ష్యంతో ఈ కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్ర మంలో సంగం సాగునీటి సంఘం అధ్యక్షులు షేక్ బాబు, అన్నారెడ్డిపాళెం టీడీపీ నాయకులు మెట్టు విజయ కృష్ణా రెడ్డి, దువ్వూరు సొసైటీ బ్యాంక్ చైర్మన్ బండ హరి కిషోర్ రెడ్డి, సంగం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతల నాని తేజ, జనసేన నాయకులు దేగ నిరంజన్, భాను, అలాగే టీడీపీ నాయకులు రవేంద్ర, తిరుమల, కృష్ణయ్య, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan